# ఇయ్యాల తెలంగాణ

IYYALATELANGANA

మన భాష – మన యాస

iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana

హైదరాబాద్ | గురువారం, 04-06-2026 | సంపుటి :10 | సంచిక :319 | పేజీలు 8 | వెల. రూ।। 4 /-


# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

**టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం**

**యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్**



హైదరాబాద్,జూన్3: తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ



కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# కర్ణాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

**ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్**

**మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం**

**సిద్దరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు**

**కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి**



బెంగళూరు,జూన్ 3(: కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

**జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు**

**మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి**



హైదరాబాద్,జూన్3: తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించి ంది. రాష్ట్రంలోని 144 సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఏ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్–ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

**తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక**

**ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు**

హైదరాబాద్,జూన్ 3(: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

**రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అనన్నం తినలేదన్నావ్**

**మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా**

**మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా**

**పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక**

హైదరాబాద్,జూన్3): తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు.

# తెలంగాణకు నా మద్దతు సిద్ధాంతపరమే: పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర సాధన పట్ల తన నిబద్ధత ఇటీవల మొదలైనది కాదని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. 2009లో ప్రజారాజ్యం పార్టీ యువరాజ్యం విభాగానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు తాను, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకులు, గద్దర్‌తో కలిసి తెలంగాణ సామాజిక న్యాయ సభలో పాల్గొన్నట్లు తెలిపారు. దివంగత వైఎస్ఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న సమయంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు బహిరంగంగా మద్దతు తెలిపానని గుర్తుచేశారు.సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమాజంలోని అన్ని



వర్గాలకు సమాన అవకాశాలు అనే పునాదులపై నిర్మించబడిన 'సామాజిక తెలంగాణ' కోసం పిలుపునిచ్చినట్లు పవన్ పేర్కొన్నారు. తెలంగాణకు తాను ఇచ్చిన మద్దతు రాజకీయ ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేశారు. ఆనాడు తీసుకున్న వైఖరి తెలంగాణ, ఆ ప్రాంత ప్రజల పట్ల తనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

IYYALATELANGANA
ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస

# సంపాదకీయం

## విద్యార్థుల జీవితాలతో ఆటలా...

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక లోపాలు, తేడాలు బయటపడడం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ సంఘటన మరువక ముందే సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు వివాదాస్పద చర్చకు దారితీస్తున్నాయి. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యార్థుల పునఃమూల్యాంకన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమ పోర్టల్‌పై భారీ సైబర్ దాడికి ప్రయత్నాలు జరిగాయని సీబీఎస్ఈ ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 16 వేల మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ సమయంలోనే కొందరు డినయల్–ఆఫ్–సర్వీస్ అనే విధానంతో పోర్టల్‌పై దాడికి ప్రయత్నించారని, దీని వల్ల 2 నిమిషాల్లోనే దాదాపు 15 లక్షల మంది లాగిన్ అవ్వడానికి ప్రయత్నించారని తెలిపింది. అనధికారికంగా పోర్టల్‌లోకి చొరబడేందుకు లక్షకుపైగా సైబర్‌దాడుల ప్రయత్నాలు జరిగినట్లు తమ భద్రత వ్యవస్థ గుర్తించిందని వివరించింది. అయితే, ఈ సైబర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నామని, ప్రస్తుతం పోర్టల్ పనిచేస్తూనే ఉందని చెప్పింది. విద్యార్థుల రీవేల్యుయేషన్ దరఖాస్తులను ప్రాసెస్ జరుగుతోందని తెలిపింది. ఒకేసారి 8,000 మందికిపైగా స్టూడెంట్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చిన వెల్లడించింది. టెక్నికల్ టీమ్‌లు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని.. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందిస్తున్నాయని పేర్కొంది. విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించేందుకు తమ బృందాలు కృషి చేస్తున్నాయని సీబీఎస్ఈ పేర్కొంది. ప్లస్‌టూ లో సీబీఎస్ఈ కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం కారణంగా తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయంటూ కొందరు విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర దుమారం రేగడంతో సీబీఎస్ఈ స్పందించింది. సమాధాన పత్రాల స్కానింగ్ కాపీలను విద్యార్థులకు అందిస్తామని, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పునఃమూల్యాంకనం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునే పోర్టల్‌పైనే తాజాగా సైబర్ దాడి జరిగినట్లు వెల్లడించింది. జాతీయ స్థాయి పరీక్షలైన క్యూట్‌యుజి వల్ల విద్యార్థులు వేర్వేరు విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షలు రాయవలసిన అవసరం లేకుండా ఒకే పరీక్ష ద్వారా దేశంలోని అత్యుత్తమ యూనివర్శిటీల్లో సీట్లు పొందగలుగుతారు. అయితే క్యూట్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సిబిఎస్ఇల్లో పదేపదే జరుగుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఉత్తీర్ణత శాతం గత ఏడాది 88.39 శాతం ఉండగా, ఈ ఏడాది 85.29 శాతానికి దిగజారింది. 90 శాతం కన్నా స్కోరు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా బాగా తగ్గింది. దీంతో చాలా మంది విద్యార్థులు తాము ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో మూల్యాంకనం కోసం ఆశ్రయించారు. 4 లక్షలకు మించి విద్యార్థులు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు కావాలని అభ్యర్థించారంటే ఎంత మంది ఈ ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలుస్తోంది. ఫిబ్రవరి 17న ఈ 12వ తరగతి పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు కేవలం పదిరోజులకు ముందుగా ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ అమలు గురించి ఉపాధ్యాయులకు తెలియజేయడం విడ్డూరం. ఈ కొత్త పద్ధతిపై ఉపాధ్యాయులకు ఎంతవరకు అవగాహన ఉంది? వారు స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను డిజిటల్ ప్రక్రియలో దిద్దగలరా? స్కానింగ్ కాపీలు స్పష్టంగా ఉంటున్నాయా? ఇవేవీ పరిశీలించకుండానే హడావిడిగా అమలు చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కూడా ఇదో అగ్నిపరీక్షగా తయారై అనేక లోపాలు పుట్టుకొచ్చాయి. ఫిబ్రవరి 9న సిబిఎస్ఇ జారీ చేసిన సర్క్యులర్‌లో ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. విద్యా సంస్కరణల్లో నూతన అధ్యాయం తప్పులు పూర్తిగా తొలగించవచ్చని, మానవ సహాయం చాలావరకు తగ్గుతుందని, మూల్యాంకనం అంటే పేపర్లు దిద్దడం చాలా వేగంగా జరుగుతుందని, ఫలితాలు వెలువడిన తరువాత తిరిగి పరిశీలించవలసిన అవసరం రాదని ఇలా ఎన్నెన్నో పేర్కొంది. కానీ ఆచరణాత్మకం వాటికి భిన్నంగా ఫలితాలు కనిపించాయి. 17 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అంటే వీరికి 98 లక్షల జవాబు పత్రాల పుస్తకాలు అందించారు. అంటే 40 కోట్ల పేజీలు ఇచ్చినట్టు. ఇవన్నీ మాన్యువల్‌గా రికార్డు సమయానికి స్కానింగ్ చేయవలసి ఉంటుంది. మూల్యాంకనం కోరిన వారికి ఇవన్నీ పరిశీలించవలసి ఉంటుంది. దీనికి తగిన కనీస మౌలిక అవసరాలు, కంప్యూటర్లు, లాకింగ్ సిస్టమ్ తదితర సాంకేతికత సరిగ్గా లేక గందరగోళం ఏర్పడి తప్పుల కుప్పలు కనిపిస్తున్నాయి. అంటే సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టమవుతోంది. స్కానింగ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి రాకుండా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియను ఎందుకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిందో అర్థంకావడం లేదు. ఉన్న వ్యవస్థను నాశనం చేసినట్టే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోపాలపై ఎవరు దర్యాప్తు చేస్తారు? లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ వల్ల మూల్యాంకనం తప్పులు, అక్రమాల పుట్టగా తయారైందని ధ్వజమెత్తారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే, దానికి మీకు బిల్లుపడుతుందన్నారు. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ. 100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ. 100, రీ ఎవాల్యుయేషన్ చేయించుకోవా లంటే ఒక ప్రశ్నకు రూ. 25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి దాదాపు రూ. 2000 చెల్లించవలసి రావచ్చన్నారు.

# ఎక్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ అధ్యక్షునిగా ముంద్రాయి శ్రీనివాస్



సికింద్రాబాద్ , జూన్ 3 (ఇయ్యాల తెలంగాణ) : గోషామహల్ నియోజక వర్గం పరిధిలోని ఎక్జిబిషన్ గ్రౌండ్ నూతన అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముంద్రాయి శ్రీనివాస్ ను నియమిస్తూ కాంగ్రేస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోతె రోహిత్ ముదిరాజ్ గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని వివిధ డివిజన్ల అధ్యక్షులుగా ప్రతిపాదించిన పేర్లను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు అందజేశారు. గోషామహల్ నియోజక వర్గం పరిధి నుంచి వచ్చిన పేర్లలో ఎక్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ అధ్యక్షునిగా శ్రీనివాస్ పేరును ప్రతిపాదించినట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గం నియామక పత్రం విడుదల చేసింది. తనపై ఉన్న నమ్మకంతో ఎక్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ అధ్యక్షునిగా నియమించడంపై శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేయడంతో పాటు పార్టీ ప్రతిష్టత కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో తనను డివిజన్ అధ్యక్షులుగా బాధ్యత అందజేసినందుకు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోతె రోహిత్ ముదిరాజ్ కు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# హైదరాబాద్ కు పొంచి ఉన్న నీటి ప్రమాదం

## కేంద్ర జలశక్తి శాఖ షాకింగ్ రిపోర్ట్

హైదరాబాద్, జూన్ 3, (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహా నగరం తీవ్ర భూగర్భ జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్‌వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 ప్రకారం నగరంలోని మొత్తం 16 మండలాల్లో 15 మండలాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలైన బార్మర్, జైసల్మేర్, పంజాబ్‌లోని డార్క్ జోన్ జిల్లాలను తలపించేలా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తక్షణమే వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ మహా నగరం ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక హబ్‌గా దూసుకుపోతుంది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరో వైపు చూస్తే నగరం భయంకరమైన జల సంక్షోభం ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర జలశక్తి శాఖ తాజాగా విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 నివేదిక ప్రకారం.. హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 16 మండలాల్లో ఏకంగా 15 మండలాలు భూగర్భ జలాల లభ్యత విషయంలో అత్యంత ప్రమాదకరమైన క్రిటికల్, ఓవర్–ఎక్స్‌ప్లాయిటెడ్ కేటగిరీల్లోకి పడిపోయాయి. ఈ గణంకాలు హైదరాబాద్‌ను రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలైన జైపూర్, జోధ్‌పూర్, బికనీర్, బార్మర్, జైసల్మేర్‌ల సరసన నిలబెట్టాయి. రాజస్థాన్‌లోనే అత్యంత ఎడారి ప్రాంతమైన బార్మర్ జిల్లాలో 14 మండలాలు ప్రమాదకర స్థితిలో ఉంటే.. హైదరాబాద్‌లో అంతకంటే ఎక్కువగా 15 మండలాలు ఆ స్థితికి చేరుకున్నాయి. నగరంలోని 50 శాతం మండలాలు అతిగా వాడబడిన కేటగిరీలో, మరో 43 శాతం మండలాలు క్లిష్టమైన స్థితిలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పంజాబ్ రాష్ట్రంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయిన జలంధర్, లూథియానా వంటి డార్క్ జోన్ జిల్లాలతో హైదరాబాద్ ప్రస్తుతం సమానంగా నిలిచింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, నాంపల్లి, షేక్‌పేట్, సైదాబాద్ వంటి కీలక మండలాలు ఈ ప్రమాదకర జాబితాలో ఉన్నాయి. కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా.. పొరుగున ఉన్న రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాల్లోని మరో 10 మండలాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 5 మండలాలు సైతం ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. అడ్డూఅదుపూ లేకుండా బోరుబావుల ద్వారా భూగర్భ జలాలను తోడేయడం, నీటిని తిరిగి భూమిలోకి ఇంకించే కనీస సంస్కృతి లేకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ సెంటర్ రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలో ప్రస్తుతం 1200 నుంచి 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా చుక్క నీరు పడటం లేదని భూమి కింద కేవలం గట్టి రాతి పొరలు మాత్రమే మిగిలాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఏడాదికి సగటున 900 మి.మీ నుండి 1000 మి.మీల భారీ వర్షపాతం నమోదవుతున్నప్పటికీ.. ఆ వర్షపు నీరంతా డ్రైనేజీల ద్వారా వృథాగా కొట్టుకుపోతోందే తప్ప భూమిలోకి ఇంకడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణుడు కె.ఎం. లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో హైదరాబాద్ పూర్తిస్థాయి జల సంక్షోభంలో చిక్కుకోకుండా ఉండాలంటే కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా పౌరులు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో బోరుబావులకు అనుసంధానంగా వర్షపు నీటి ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎకరం భూమి ధర రూ. 200 కోట్లు పలుకుతున్న నూతన ఐటీ కారిడార్ ప్రాంతాల్లో భూమి పైన ఉన్న సంపదతో పాటు భూమి కింద ఉన్న జల సంపదను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అంటున్నారు. విచ్చలవిడి కాంక్రీట్ నిర్మాణాలను నియంత్రిస్తూ.. బోరుబావుల సంఖ్యపై పరిమితులు విధించి వర్షపు నీటిని సంరక్షించుకుంటేనే హైదరాబాద్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ౯ జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు

ఖమ్మం, జూన్ 3, (న్యూస్ పల్స్)తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సూపర్ బజార్లు, లాజిస్టిక్స్ హబ్‌లు, ఆధునిక రైస్‌మిల్లులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ వేగంగా అడుగులు వేస్తోంది. మహిళా సంఘాల ద్వారానే వీటిని సమర్థవంతంగా నిర్వహించి, వారిని వ్యాపారవేత్తలుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పంఈ బృహత్తర ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి దశ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి కాకుండా.. ప్రాథమికంగా తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున మహిళా శక్తి సూపర్ బజార్లను స్థాపించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ తరహాలోనే ఈ సూపర్ బజార్లలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, వివిధ రకాల పరికరాలను తక్కువ ధరలకే విక్రయించేలా ఖమ్మంలో మొదటి పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారుఈ సూపర్ బజార్ల నిర్మాణానికి జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సుమారు 5 వేల గజాల స్థలం అవసరమని సెర్ప్ అధికారులు గుర్తించారు. అనువైన ప్రభుత్వ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు తక్షణమే లేఖలు రాయాలని నిర్ణయించారు. మరోవైపు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్స్ హబ్, రైస్‌మిల్లు ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ గోదాం, లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లుల స్థాపన కోసం దాదాపు 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ప్రతిపాదనలు పంపేందుకు సెర్ప్ సిద్ధమైంది. ఈ మెగా ప్రాజెక్టుల విజయవంతమైన నిర్వహణకు గానూ.. ఆయా జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మంలో నిర్మించబోయే లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లులకు సంబంధించి ఏ మండలంలో అయితే భూమిని ఎంపిక చేస్తారో అదే మండలానికి చెందిన మహిళా సమాఖ్యకే పూర్తి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా ప్రాజెక్టులు రానున్నందున.. రాష్ట్రంలోని అన్ని మహిళా సమాఖ్యలు ఆర్థిక నిర్వహణకు, వ్యాపార బాధ్యతలకు సిద్ధంగా ఉండాలని సెర్ప్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ మహిళా లోకంలో సరికొత్త ఉపాధి విప్లవం రానుంది

# భారీ ఫ్లైఓవర్ కోసం సర్కార్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూన్ 3, (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లైఓవర్ నిర్మించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌బీ నగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో.. ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు నిర్మించగా.. తాజాగా మరొకటి నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.416 కోట్లను కూడా కేటాయించింది. త్వరలోనే ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ పనులు చేపట్టేందుకు అధికారులు రెడీ అయ్యారు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లను గుర్తించి.. అక్కడ భారీ ఫ్లైఓవర్లను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్లతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరంలోని తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టీకేఆర్ కాలేజీ, గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఎయిర్‌పోర్టు మార్గంలో ట్రాఫిక్ తగ్గనుంది. అంతేకాకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభించనుండగా.. ఎల్‌బీ నగర్ నుంచి పాతబస్తీ వైపు ప్రయాణం కూడా మరింత సులభతరం కానుంది. త్వరలోనే భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్ల వ్యయంతో ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.

# శివశక్తి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు





సికింద్రాబాద్ , జూన్ 3 (ఇయ్యాల తెలంగాణ) : తెలంగాణ శివశక్తి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు సీతాఫల్ మండి సికింద్రాబాద్ లో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే మూట గోపాల్,వలీ మంత్రి ఎమ్మెల్యే తీగల పద్మారావు గౌడ్ గారు హాజరై పూస శివ తేజస్ ను అభినందించారు. శివశక్తి మ్యారేజ్ బ్యూరో దినదిన అభివృద్ధి చెందాలని,మంచి పేరు ప్రతిష్టలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూస శివతేజస్ వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ శివశక్తి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఇంచార్జ్ పూస యమునారాణి మరియు సలహాదారు విలియం సరోజిని మరియు శివశక్తి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవము



హైదరాబాద్, జూన్ 3 (ఇయ్యాల తెలంగాణ) :తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు హైద్రాబాద్ లోని గన్ పార్కు వద్ద గల అమర వీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్, ఉపాధ్యక్షులు శ్రీరామ కృష్ణ,హైదరాబాద్ జిల్లా పార్లమెంటు ఇంచార్జీలు మూల రామ్ చరణ్ దాస్, అదారి రాజేష్,అధ్యక్షులు అల్గోల రమేశ్, ఇతర జిల్లా నాయకులతో పాటు గోషామహల్ నాయకులు జీసి శేఖర్,కళ్యాణి నందీశ్వర్,ఎల్ అనిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రినాక ఇన్స్పెక్టర్ కు ఇయ్యాల తెలంగాణ అవార్డు

హైదరాబాద్, జూన్ 3 (ఇయ్యాల తెలంగాణ) :తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇయ్యాల తెలంగాణ న్యూస్ డైలీ ఇ – డిజిటల్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో భాగంగా దక్షిణ మండలం పరిధిలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ ఎస్ కోటేశ్వర్ రావు కు ఇయ్యాల తెలంగాణ ప్రత్యేక అవార్డు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీమ్ మెంబెర్స్ మహేష్ బాబు, గడ్డం సత్యనారాయణ, వీరు, భుజెందర్ బాబు, ఇమ్మన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.





ఇయ్యాల తెలంగాణ:మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ గారి సతీమణి ఎండోక్రినాలజిస్ట్, సీనియర్ డాక్టర్ సుచి యాష్కీకి అమెరికాలో కారు ప్రమాదం తమ చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కిని బోస్టెన్ లోని హార్వర్డ్ యూనివర్సిటీ అనుబంధ హాస్పిటల్ లో ఎండి కోర్సులో జాయిన్ చేసి తిరుగు ప్రయాణంలో న్యూయార్క్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వర్షం కారణంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డాక్టర్ సుచియాష్కికి రిబ్స్ విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మధుయాష్కి గౌడ్ గారు కూడా ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు. డాక్టర్ గగన యాష్కి న్యూయార్క్ మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా కాన్వొకేషన్ వేడుకకు హాజరయ్యేందుకు ఇటీవల ఆయన అమెరికా వెళ్లారు. కుమార్తెను ఎండి కోర్సులో జాయిన్ చేసే క్రమంలో లగేజీ ఎక్కువ ఉన్న క్రమంలో డాక్టర్ సూచి, మధుయాష్కి వేర్వేరు కార్లలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా రేపు ఆయన ఇండియాకు తిరిగి రావాల్సి ఉండగా ఈ ప్రమాదం జరిగింది.

ఇయ్యాల తెలంగాణ



# బాల్కసుమన్‌పై పెట్టిన సెక్షన్లు చూసి జడ్జి ఆశ్చర్యపోయారు : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను చంచల్ గూడ జైలులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరామర్శించారు. అనంతరం జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ..అక్రమ కేసులు పెట్టి చంచల్‌గూడ జైలులో నిర్బంధించిన మా ఉద్యమ సహచరుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ మేం బీఆర్ఎస్ పార్టీ తరపున కలిశామన్నారు. ఈ కేసు చూసినప్పుడు వాళ్లు పెట్టిన సెక్షన్లు చూసి జడ్జిగారే ఆశ్చర్యపోయారు. అసలు బాల్క సుమన్ మాట్లాడిందేంది.. మీరు పెట్టిన సెక్షన్లు ఏంది..ఆయుధాలు పట్టుకున్నట్టు ఎవరినో చంపేందుకు ప్రయత్నించినట్టు దేశద్రోహానికి పాల్పడినట్టు మొత్తం దేశంలో ఎన్ని రకాల సెక్షన్లున్నాయో అన్ని తీసుకువచ్చి ఇందులో పెట్టిర్రు. కోర్టే వారికి మొట్టికాయలు వేసి ఈ సెక్షన్లను కూడా తీసేయాలని చెప్పడం జరిగిందన్నారు. బాల్కసుమన్ ఎవరో నలుగురు కూర్చొని మాట్లాడుకుంటున్న సందర్భంలో వ్యక్తిగతంగా ఏదో అన్నడని చెప్పి.. దాన్ని వీళ్లు ఎక్కడో రీసెర్చ్ చేసి ఆర్కియాలజీ పట్టుకొచ్చినట్టు ఓ ఉద్యోగస్తుడిని భయపెట్టించి నకిలీ ఫిర్యాదు చేయించారు. మేము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నం. మా పార్టీ ఎప్పుడూ కూడా హింసను ప్రేరేపించదు.. కేసీఆర్ కూడా వాటిని ఎప్పుడూ ఒప్పుకోరు. ఇదంతా బీఆర్ఎస్ నాయకులను అణచివేయడానికి, భయపెట్టించేందుకు ఈ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన కుట్ర తప్ప ఇంకొకటి కాదన్నారు జగదీష్ రెడ్డి. మేము బాంబులు పెట్టి సెక్రటేరియట్‌ను పేల్చేస్తామని, అడివిలోకి పోయి తుపాకులు పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను చంపేస్తామని గతంలో కాంగ్రెస్ నాయకులు అన్నారు.. అప్పుడు మేము ఎవరి మీద కేసులు పెట్టలేదు..లేనిది సృష్టించి బాల్క సుమన్ మీద అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. జైళ్లు, కేసులు ఏమీ మాకు కొత్త కాదు.. ఈ అణిచివేతని ఎదుర్కొని తప్పకుండా అధికారంలోకి వస్తామన్నారు.

# ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయ వాదం : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ : ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయ వాదం అని, ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే మీరే ఉగ్రవాదులు అవుతారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ వాదంపై అక్కసు వెళ్లగిక్కిన నేపథ్యంలో నిరంజన్ రెడ్డి స్పందించారు. తెలంగాణ పౌర సమాజాన్ని కించపరిచేలా మాట్లాడిన పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాచరికపు పాలన పోయి తెలంగాణ దేశంలో విలీనం కావాలని పోరాటం చేసిన జాతీయ వాదులు మా తెలంగాణ ప్రజలు అని గుర్తు చేశారు. మమ్మల్ని బలవంతంగా ఆంధ్రా ప్రాంతంతో విలీనం చేసిని విషయాన్ని గుర్తు చేశారు. నాడు మీ దుర్మార్గాల నుంచి విడిపోవాలని పోరాడారు తప్ప తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కాదని స్పష్టం చేశారు. పక్కా రాష్ట్రాల వాళ్లు వచ్చి మనల్ని వెక్కిరిస్తుంటే మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి పెద్ద ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన విధంగా మిగతా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. నీ నోళ్లకు పక్షవాతం వచ్చిందా అని ప్రశ్నించారు. అధికార పక్షం, ప్రతి పక్షం విషయంలో ఎన్నో విభేదాలు ఉండొచ్చు. కానీ, తెలంగాణకు అవమానం జరుగుతుంటే అందరు ఏకతాటి పైకి వచ్చి మాట్లాడకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం పని చే స్తుందని సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



# 6 రూమ్‌లకే పర్మిషన్, కానీ 24 రూమ్‌లకు బుకింగ్.. మృతుల్లో 10 మంది విదేశీయులు



న్యూఢిల్లీ: ఢిల్లీలోని మాల్వియా నగర్‌లో ఉన్న బిల్డింగ్‌లో జరిగిన అగ్నిప్రమాదం(ఆవశ్రీప్రతి ఈతితీవ ంఞఞతిటవనిబి)లో 21 మంది మృతిచెందారు. ఫ్లోరిష్ స్టే హోటల్‌లో పర్మిషన్ కేవలం ఆరు రూమ్‌లకు మాత్రమే ఉన్నది. కానీ ఆ స్టే ఇన్‌లో 24 రూమ్‌లకు బుకింగ్ అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. లైసెన్సు జారీ అంశంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగాయా లేదా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన అతిపెద్ద అగ్నిప్రమాద ఘటనగా ఇది నమోదు అయ్యింది. బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద ఆరు రూమ్‌లకు ఢిల్లీ టూరిజం శాఖ పర్మిషన్ ఇచ్చింది. కానీ అక్రమంగా ఆ హోటల్ గదిలో 24 రూమ్‌లను నడుపుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఆ హోటల్‌కు 24 రూమ్‌లు ఉన్నట్లు రిజర్వేషన్ చూపిస్తున్నది. అయిదు అంతస్తుల ఆ బిల్డింగ్ ప్రమాదంలో 40 మందిని రక్షించారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్ నుంచి మంటలు వ్యాపించి ఉంటాయని తొలుత అనుమానించారు. కానీ బీ అండ్ బీ ఈటరీ బిల్డింగ్ నుంచే మంటలు వ్యాప్తి చెందినట్లు అంచనాకు వచ్చారు. 21 మంది మృతుల్లో పది మంది విదేశీయులు ఉన్నట్లు నిర్ధారించారు. వారిలో ఎక్కువ శాతం మంది సెంట్రల్ ఏషియా, ఆఫ్రికా దేశస్థులు ఉన్నారు. గాయపడ్డ వారి సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బిల్డింగ్‌లో ఓ బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, అయిదు అంతస్తులు ఉన్నట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖ చెబుతోంది. ఉదయం 9.30 నిమిషాల సమయంలో బిల్డింగ్‌లో మంటలు, పొగ అలుముకున్నట్లు తెలిసింది. బీ అండ్ బీలో స్టే చేస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారే ఎక్కువగా బీ అండ్ బీలో బస చేస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ నుంచి మోకాలి మార్పిడి గురించి అయిదు రోజుల క్రితం ఓ ఫ్యామిలీ ఆ హోటల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తున్నారు. బిల్డింగ్‌లో ఎటువంటి వెంటిలేషన్ లేదని, కిటికీలు లేవని, బాత్రూమ్‌ల్లో కూడా కిటికీలు లేవని ఓ వ్యక్తి ఆరోపించాడు. ఆ బిల్డింగ్‌కు ఒకే ఎగ్జిట్ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

# పండు మాస్టర్ ఆరోగ్యంపై డాక్టర్ల కీలక ప్రకటన..

## ఎలాంటి ప్రాణాపాయం లేదు,మరి తిరిగి డ్యాన్స్ చేయగలడా?

హైదరాబాద్ , ప్రఖ్యాత డ్యాన్స్ షో 'ఢీ' ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఎంతో చేరువైన ప్రముఖ కొరియోగ్రాఫర్, డ్యాన్సర్ పండు మాస్టర్ విశాఖపట్నంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు తాజాగా హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రమాదంలో పండు మాస్టర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా హిప్ జాయింట్ డిస్‌లొకేట్ కావడంతో పాటు మోకాళ్ల కింద భాగంలోని ఎముకలు, జాయింట్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. అన్ని వైద్య పరీక్షలు పూర్తిచేసిన అనంతరం ఒక సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. హిప్ జాయింట్‌కు సంబంధించిన సమస్యను తొలి ఆపరేషన్ ద్వారా పరిష్కరించామని, మిగిలిన గాయాలకు సంబంధించి మరికొన్ని శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని డాక్టర్లు తెలిపారు. ప్రమాద సమయంలో తలకు కూడా గాయం అయినప్పటికీ ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పండు మాస్టర్ అభిమానులను ఎక్కువగా ఆందోళనకు గురిచేసిన అంశం ఆయన భవిష్యత్తులో మళ్లీ డ్యాన్స్ చేయగలరా అనే ప్రశ్న. దీనిపై వైద్యులు సానుకూల సమాచారం ఇచ్చారు. అవసరమైన శస్త్రచికిత్సలు పూర్తయిన తర్వాత కనీసం ఆరు నెలల పాటు విశ్రాంతి తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడిన అనంతరం తిరిగి తన డ్యాన్స్ కెరీర్‌ను కొనసాగించవచ్చని, ప్రస్తుతం అందుకు ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించడం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ సమాచారం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. మంగళవారం పండు మాస్టర్ తన బృందంతో కలిసి విశాఖ జిల్లా తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి ప్రయాణం చేస్తుండగా ఆనందపురం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణం మధ్యలో టీమ్‌లోని ఒక డ్యాన్సర్ అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఆ సమయంలో పండు మాస్టర్ కారులో నుంచి దిగి వెనుక భాగంలో నిలబడి ఉన్నారు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్ అదుపు తప్పి కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో కారు మరియు వ్యాన్ మధ్య పండు మాస్టర్ చిక్కుకుపోయారు. దీంతో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, సహచరుల సహాయంతో వెంటనే ఆస్పత్రికి తరలించినట్టు తెలుస్తుంది.



# రుద్రంపూర్ మార్కెట్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



చుంచుపల్లి, జూన్ 03 : రుద్రంపూర్ మార్కెట్ ఏరియాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భారీ రావిచెట్టు బుధవారం తెల్లవారుజామున వచ్చిన గాలి దుమారానికి కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై, అలాగే సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ షెడ్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో పలు విద్యుత్ స్తంభాలు కూడా దెబ్బతినడంతో ఉదయం 4 గంటల నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అంతరాయంతో రుద్రంపూర్ మార్కెట్ ప్రాంతంతో పాటు పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండలు మండిపోతున్న వేళ ఫ్యాన్లు, కూలర్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. మరోవైపు మార్కెట్ ఏరియాలోని వ్యాపార సముదాయాలకు విద్యుత్ లేకపోవడంతో పలువురు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేయాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే మరమ్మతు పనులు చేపట్టి విరిగిపోయిన కొమ్మలను తొలగించారు. దెబ్బతిన్న విద్యుత్ తీగలు, స్తంభాల మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ఏఈ లక్ష్మి నరసింహారావు, లైన్‌మెన్ కిషన్, సాంబశివరావు పంచాయతీ సిబ్బంది శ్రమించారు. భారీ చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లకు ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి చెట్ల కొమ్మలను కత్తిరించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# టీఎంసీలో తిరుగుబాటు..

## 59 మంది ఎమ్మెల్యేల సంతకాలతో స్పీకర్‌కు లేఖ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని విపక్ష తృణమూల్ కాంగ్రెస్ (౧ఓఅ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది పార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ ఇటీవల పార్టీ నుంచి బహిష్కరణ గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ క్లెయిమ్ చేసుకున్నారు. తన వర్గం ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు బుధవారంనాడు అందజేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా రితబ్రత బెనర్జీని, డిప్యూటీ లీడర్లుగా సెయిలీ సాహా, అహ్మద్ ఖాన్ పేర్లను ఈ లేఖలో ప్రతిపాదించారు. దీనికి ముందు టీఎంసీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు బస్సులో అసెంబ్లీకి వచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున తమ బలం చాటుకునేందుకు వారంతా కలిసికట్టుగా వచ్చారు. రెబల్ ఎమ్మెల్యేలకు రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. కాగా, లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో రితబ్రత బెనర్జీ (ఉలుబేరియా పూర్బ), సందీపన్ సహా (ఎంటల్లీ), సబీనా యాస్మిన్ (సుజాపూర్), చంద్రనాథ్ సిన్హా (బోల్పూర్), నియామత్ షేక్ (హరిహర్‌పార), సెయిలీ సాహా (కేశ్‌పూర్), తపస్ మైతీ (దోమ్‌జూర్), అరూప్ రాయ్ (హౌరా మధ్య), ఎండీ గులామ్ రబ్బాని (గోల్పోఖర్), ఉషారాణి మోండల్ (మినాఖాన్), ప్రియాల్ పాల్ (సంక్రయిల్), గుల్షన్ ముల్లిక్ (పాంచ్లా), రతిన్ ఘోష్ (మధ్యంగ్రామ్), సుభాశిష్ దాస్ (మహేష్‌తాల), ముస్తాఫిజుర్ రెహమాన్ (భరత్‌పూర్), అఖ్రుజ్జామన్ (రఘునాథ్‌గంజ్), సమీర్ ముఖర్జీ (రతువా), ప్రసూన్ బెనర్జీ (చంచల్) ఉన్నారు. మరోవైపు, 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ పార్టీ నుంచి సస్పెండయిన రితబ్రత బెనర్జీ క్లెయిమ్ చేసుకోవడం, సంతకాలతో కూడిన లేఖను స్పీకర్‌కు అందజేయడంపై మమతా బెనర్జీ అధికారింగా ఇంకా స్పందించలేదు. అయితే పార్టీ లెజిస్లేటివ్ విభాగం కీలక నియామకాల వివరాలను టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ అసెంబ్లీ స్పీకర్‌కు తెలియజేశారు. శోభన్‌దేవ్ ఛటోపాధ్యాయ్‌ను అసెంబ్లీలో విపక్ష నేతగా, ఆషిమా పాత్ర, నయన బందోపాధ్యాయ్ డిప్యూటీ లీడర్లుగా, చీఫ్ విప్‌గా ఫర్హాద్ హకీమ్‌ను పార్టీ నియమించినట్టు తెలియజేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన అభియోగంపై ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సహాలను పార్టీ నుంచి ఇటీవల టీఎంసీ బహిష్కరించింది. ఈ నేపథ్యంలో తమదే అసలైన టీఎంసీ అంటూ రితబ్రత బెనర్జీ స్పీకర్‌కు లేఖ అందజేయడం సంచలనమవుతోంది. టీఎంసీకి 80 మంది శాసనసభ్యులు ఉండగా వీరిలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది మద్దతు ఉంటే ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఆ ఎమ్మెల్యేలపై వేటుపడదు. ఆ ప్రకారం తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరిగా ఉండాలి. అయితే తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రితబ్రత బెనర్జీ పేర్కొనడం, స్పీకర్‌ను కలిసి లేఖ ఇవ్వడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.



# టీఎంసీ రెబల్ ఎమ్మెల్యేల లేఖను స్వీకరించిన స్పీకర్.. నిర్ణయంపై ఉత్కంఠ



కోల్‌కతా: అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో తుపాను రేగింది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ సంతకాలతో కూడిన లేఖను పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీ స్పీకర్‌కు బుధవారంనాడు సమర్పించడం సంచలనమవుతోంది. రెబల్ వర్గం లేఖను స్వీకరించిన స్పీకర్ దీనిపై తన నిర్ణయాన్ని మధ్యాహ్నం 4 గంటలకు ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. దీంతో టీఎంసీలో తిరుగుబాటు ఏ మలుపు తిరగనుందనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. మరోవైపు, తిరుగుబాటు వర్గానికి సమాంతరంగా అసెంబ్లీలో తమ పార్టీ కీలక నియామకాలను టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పీకర్‌కు తెలియజేశారు. శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ను అసెంబ్లీలో విపక్ష నేతగా, ఆశిమా పాత్ర, నారాయణ్ బందోపాధ్యాయ్‌లను డిప్యూటీ నేతలుగా, ఫర్హాద్ హకీమ్‌ను చీఫ్ విప్‌గా నియమించామని అందులో పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే అభియోగంపై రితబ్రత బెనర్జీ, సందీపన్ సహాలను టీఎంసీ ఇటీవల బహిష్కరించింది. ఈ క్రమంలో రితబ్రత బెనర్జీ నాయకత్వంలో తిరుగుబాటు ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి ఎమ్మెల్యేల మద్దతు లేఖను అందించడం సంచలనమవుతోంది. ఈ పరిణామంపై పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇంకా అధికారికంగా స్పందించలేదు. పార్టీలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ బుధవారంనాడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. బెంగాల్‌లో పార్టీ కమిటీలు, అనుబంధ సంస్థలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రతిస్థాయిలోనూ సమగ్ర పరిశీలన, పనితీరు సమీక్ష, సంస్థాగత అంచనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

# సికింద్రాబాద్ జేబీఎస్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం.. బైకర్‌పైకి దూసుకెళ్లడంతో..

హైదరాబాద్, జూన్ 03: సికింద్రాబాద్ జూబ్లీహిల్స్ బస్టాప్ (ఏహ) సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. నియంత్రణ కోల్పోయిన బస్సు ఒక్కసారిగా ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. జేబీఎస్ నుంచి కార్ఖానా వైపు వెళ్తున్న బస్సు అదుపు తప్పి ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న శివ అనే ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొట్టింది. దీంతో యువకుడు తన బైక్‌తో సహా బస్సు ముందు చక్రాల కింద ఇరుక్కుపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి యువకుడిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ బస్సును జరపడం సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్రేన్‌ను రప్పించి, బస్సును పక్కకు జరిపి, యువకుడిని బయటికి తీశారు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.




# ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఢిల్లీ, జూన్ 3 : ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# బంగారం విక్రయిస్తున్న భారత్

ముంబై, జూన్ 3, (న్యూస్ పల్స్)పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. అలాగే ఈ ఏడాది 2026 జనవరి నుంచి ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో రూ.2.25 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ మదుపరులు విక్రయించారు. తమ పెట్టుబడులను తీసుకెళ్లారు. ఈ కారణాలతో అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. రూపాయి విలువ పడిపోతోంది. దీంతో మన దగ్గర ఉన్న విదేశీ మారకపు నిల్వల విలువ భారీగా పడిపోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫారెక్స్ నిల్వలు రూ.728.49 బిలియన్ డాలర్లుగా ఉండగా అది 4 నెలల్లోనే 47 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 681.40 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. వీటిని కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.57 వేల కోట్లు విలువైన పసిడి నిల్వలను విక్రయించినట్లు ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్ బర్గ్ తెలిపింది.ఫారెక్స్ నిల్వలు వృథాగా పోకుండా చూసేందుకు బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు కంటే పెంచి 15 శాతానికి చేసింది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూసేందుకు పెట్రోల్, డీజిల్ ధరలనూ పెంచింది. అలాగే రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న నిల్వల్లో రూ.57 వేల కోట్ల పసిడిని మే 22తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో విక్రయించింది. తద్వారా విదేశీ కరెన్సీ ఆస్తులకు ఈ మొత్తాన్ని జమ చేసుకుంది. మన ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు 543.032 బిలియన్ డాలర్లు కాగా పిసిడి నిల్వలు 114.786 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారమే 2 వారాల్లో పసిడి నిల్వల విలువ 6 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది.దేశ ఎగుమతుల కంటే దిగుమతులు బిల్లు భారీగా పెరుగుతోంది. దీంతో కరెంటు ఖాతా లోటు అంతకంతకూ అధికమవుతోంది. రూపాయి విలువ ఈ సంవత్సరంలో 7 శాతం వరకు పతనం అయ్యేందుకు కారణమైంది. అందుకే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలో డాలర్ నిల్వలను పెంచుకుని, రూపాయిని బలోపేతం చేయడంపై రిజర్వ్ బ్యాంక్ దృష్టి పెట్టింది. అందుకే బంగారం విక్రయిస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో ఆర్బీఐ వద్ద 880.52 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. వీటిలో 77 శాతం నిల్వలు భారత్‌లోనే ఉన్నాయి. అంతకు 6 నెలల క్రితం మన దేశంలో ఉన్న బంగారం నిల్వలు 66 శాతంగా ఉండడం గమనార్హం. మిగిలిన బంగారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ దగ్గర ఉండేది.

# వెండి పై మరిన్ని ఆంక్షలు

ముంబై, జూన్ 3, పెరుగుతున్న దిగుమతులను అరికట్టడానికి, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడానికి కేంద్రం వెండి దిగుమతులపై ఆంక్షలను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా వెండిని గ్రెయిన్, పొడి రూపాల్లో ఉన్న వెండి దిగుమతిని నిషేధిత జాబితాలోకి చేర్చింది. పొడి, గ్రెయిన్ రూపాల్లో భద్రపరిచే కేటగిరీ కిందకు తీసుకురావడంతో పాటు, దిగుమతిదారులు ముందస్తు ప్రభుత్వ అనుమతి పొందాలని కూడా ఆదేశించింది. వెండి దిగుమతులకు తప్పనిసరిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ అనుమతి ఉండాలని కేంద్రం తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత గల వెండి ఉన్న గ్రెయిన్, పొడి, ఇతర రూపాల్లోని వండి వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గత నెలలోనే 99.99 శాతం ప్యూరిటీ గల వండి కడ్డీల దిగుమతులను, పాక్షికంగా తయారైన అన్ని రకాల వెండి వస్తువులను నిషేధిత జాబితాలో కేంద్రం చేర్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరల కారణంగా విదేశీ మారకపు నిల్వపై ఒత్తిడిని తగ్గించేందుకు వెండి, బంగారం దిగుమతుల సుంకాన్ని భారీగా పెంచింది. 6 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని రెండింతలకు పైగా పెంచి 15 శాతానికి చేర్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు దేశంలోకి వెండి దిగుమతులు భారీగా పెరుగుతున్న క్రమంలో మరిన్ని ఆంక్షలు విధించింది.వెండి దిగుమతులు భారీగా పెరిగిన నేపథ్యంలో తాజా ఆంక్షలు విధించింది కేంద్రం. ప్రపంచంలోనే వెండిని అత్యధికంగా వినియోగించే దేశంగా భారత్ ఉంది. మార్చి 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వెండి దిగుమతులపై రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం 4.8 బిలియన్ డాలర్లుగా ఉంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 157 శాతం మేర పెరిగి 411 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.పెరిగిన చమురు ధరల నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని అరికట్టే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా విలువైన లోహాల దిగుమతులను నిరుత్సాహపరిచేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. గత నెలలో బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. అయితే కొత్త నిబంధనలు దిగుమతిదారులకు అనిశ్చితిని సృష్టించవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దేశంలో వెండిని ఆభరణాలు, నాణేలు, కడ్డీలు, అలాగే సౌరశక్తి, ఎలక్ట్రానిక్స్ వంటి పారిశ్రామిక అవసరాల కోసం విస్తృతంగా ఉపయోగిస్తారు. బలమైన పెట్టుబడిదారుల ఆసక్తి కూడా దీనికి తోడైంది. గత సంవత్సరంలో సిల్వర్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్‌కి నిధుల ప్రవాహం రికార్డు స్థాయికి చేరుకుంది.

# సీబీఎస్ఈ వివాదం..రంగంలోకి కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 3 (న్యూస్ పల్స్)సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ రీవేల్యుయేషన్ ప్రక్రియలో లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. బోర్డు ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలనుబదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త ఛైర్మన్‌గా లోఖండే ప్రశాంత్ సీతారామ్, కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్‌ను నియమించింది. అంతేకాదు,ఈ వివాదంపై విచారణకు కమిటీని నియమించింది. ఛైర్మన్ హోదాలో సీబీఎస్ఈ బోర్డు మొత్తం పనితీరు, పరిపాలన బాధ్యతలను రాహుల్ సింగ్ నిర్వర్తిస్తుండగా.. బోర్డుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను హిమాంశు చూసుకుంటున్నారు.ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు, విద్యార్థులు నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సామర్థ్య నిర్మాణ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్. రాధా చౌహాన్ ఈ ఏకసభ్య కమిటీకి అధ్యక్షత వహిస్తారు. వ్యవహారాలు- శిక్షణ విభాగానికి సమర్పిస్తుంది. మరోవైపు, ఓఎస్ఎం అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సంజయ్ కుమార్‌తో పాటు రాహుల్ సింగ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.జవాబు పత్రాలు తారుమారు కావడం, మూల్యాంకనంలో తప్పులు, తప్పుడు దిశానిర్దేశం, తప్పుడు గ్రేడ్‌ల కేటాయింపు వంటి అనేక సమస్యలు ఉన్నాయి. స్కాన్ చేసిన కాపీల తమవి కావని కనుగొన్నారు. మూల్యాంకన ప్రక్రియలో సుమారు 20 జవాబు పత్రాల పొంతన లేనివిగా గుర్తించినట్లు సీబీఎస్ఈ అధికారులు అంగీకరించారు.

# సెంటిమెంటే...ఆయింట్ మెంట్

## ఆత్మగౌరవ నినాదంతో అడుగులు

హైదరాబాద్, జూన్ 3, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, మంగళవారం జరిగిన సమావేశం పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం.కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్‌కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్‌కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్ఎస్‌కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు.రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు , పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన వాదించనున్నారు.పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్‌ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్‌ను పెంచాలని బీఆర్ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్ఎస్‌కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

# హోమ్ మంత్రిగా స్పీకర్...?

హైదరాబాద్, జూన్ 3, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో, ఎట్టకేలకు కేబినెట్ విస్తరణ, పునర్వ్యవస్థీకరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వచ్చేవారంలోనే ఈ ప్రక్రియ పూర్తి కావచ్చని గాంధీభవన్ వర్గాల నుంచి బలమైన సంకేతాలు అందుతున్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి సహా 16 మంది మంత్రులు ఉండగా, మరో రెండు ఖాళీలు ఉన్నాయి. అయితే కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, కొందరు మంత్రుల శాఖలను మార్చడం, పనితీరు ఆధారంగా ఒకరిద్దరిని పక్కన పెట్టే అవకాశాలు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈసారి కేబినెట్ విస్తరణలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధానాంశం.. ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రివర్గంలోకి రానుండటం. గత వారం ఆయన ఉన్నట్టుండి ఢిల్లీ పర్యటనకు వెళ్లడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందనే చర్చ నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పక్కా స్క్రిప్ట్ మేరకు ప్రసాద్ కుమార్ హస్తినకు వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారని పార్టీ వర్గాల మాట. తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరగా, రాహుల్ గాంధీ నుంచి సానుకూలత వ్యక్తమైనట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉన్న కీలకమైన హోం శాఖను గడ్డం ప్రసాద్‌కు అప్పగించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. స్పీకర్ పదవి లాంటి ఉన్నత స్థానం నుంచి తక్కువ ప్రాధాన్యత ఉన్న శాఖకు మారిస్తే విమర్శలు వస్తాయని, అందుకే హోం శాఖ ఇవ్వడమే సరైన నిర్ణయమని ఏఐసీసీ భావిస్తోంది.తొలి విడత కేబినెట్ కూర్పులో ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ వంటి జిల్లాలకు ప్రాతినిధ్యం లభించలేదు. ఈ నేపథ్యంలో ఈసారి ఆయా జిల్లాలకు పెద్దపీట వేయనున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవిని గట్టిగా ఆశిస్తున్నారు. అయితే, ఇప్పటికే కేబినెట్‌లో రెడ్ల ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే విమర్శలు ఉండటంతో, అదే జిల్లాకు చెందిన ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌ను తీసుకోవడం వల్ల సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ల విశ్లేషణ.మరోవైపు నల్గొండ జిల్లా నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి రేసులో ముందంజలో ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి నిజామాబాద్ నుంచి సీనియర్ నేత పి. సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్‌సాగర్ రావు, బీసీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి మరికొందరు ఆశావహులు ఏఐసీసీ పెద్దల తలుపు తడుతున్నారు.ఇప్పటికే ఉన్న కొందరు మంత్రుల శాఖల మార్పుపై కూడా రేవంత్ రెడ్డి కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జూన్ రెండో వారంలో ఏఐసీసీ అధిష్ఠానం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో తుది సమావేశం నిర్వహించి జాబితాను ఖరారు చేయనుంది

# గ్రామాల్లో ఇంటర్ నెట్ స్పీడ్ కోసంనయా కార్పొరేషన్

హైదరాబాద్, జూన్ 3, (న్యూస్ పల్స్)తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ అమెండెడ్ భారత్ నెట్ పథకం కింద కేంద్ర, రాష్ట్రాల సమాన భాగస్వామ్యంతో ఇది పనిచేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం కార్పొరేషన్ నిర్వహణ కోసం పదేళ్లకు రూ.2600 కోట్లు అలాగే తొలి విడతగా 3 లక్షల గ్రామీణ కనెక్షన్ల కోసం రూ.300 కోట్లు మంజూరు చేసింది.తెలంగాణలోని పల్లెపల్లెకూ హైస్పీడ్ డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ పథకంలో భాగంగా.. తెలంగాణ రూరల్ ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఢఖీఎఎఅఒ)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ నూతన సంస్థ పనిచేయనుంది.ఈ కొత్త కార్పొరేషన్ బోర్డులో ఇరుపక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించారు. బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సీఈవోతో పాటు ఐటీ, ఆర్థిక, పంచాయతీరాజ్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తరఫున ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సేవలందిస్తున్న తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కొత్త కార్పొరేషన్‌కు కూడా సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారుతెలంగాణకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా కొత్త కార్పొరేషన్ ఏర్పాటు నిబంధనల్లో కొన్ని కీలక వెసులుబాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భారీ నిధులను ఆమోదించింది. కార్పొరేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర సాంకేతిక అవసరాల కోసం ఏటా రూ.260 కోట్ల చొప్పున.. రాబోయే పదేళ్ల కాలానికి గానూ మొత్తం రూ.2600 కోట్ల భారీ నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో పాటు భారత్ నెట్ ఉద్యమీ ప్రోగామ్ కింద తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి విడతలోనే రాష్ట్రంలోని పల్లెటూళ్లలో 3 లక్షల గృహాలకు ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.10వేల చొప్పున మొత్తం రూ.300 కోట్లను కేంద్రం భరించనుంది. గతంలో నిర్మించిన భారత్ నెట్ ఫేజ్-1, 2 నెట్‌వర్క్‌లను అత్యాధునికంగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఇప్పటివరకు కనెక్టివిటీ లేని మారుమూల గ్రామాలకు ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న టీ-ఫైబర్ జిల్లా, మండల కేంద్రాల వరకే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తుండగా.. కొత్తగా ఏర్పాటైన టీఆర్ఐఐసీఎల్ మండల కేంద్రాల నుండి చివరి గ్రామ స్థాయి వరకు ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లి దాని నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించనుంది.

# పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే...

## అమల్లోకి వచ్చిన సీఈపీఏ




న్యూఢిల్లీ, జూన్ 3, (న్యూస్ పల్స్)అమెరికా?ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్‌కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్‌పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్?ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్‌లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్‌కు చమురు, ఎల్ఎన్‌జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్‌కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్‌తో ఒప్పందం కారణంగా హోర్ముజ్‌పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్‌పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య ? ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

# బాలీవుడ్ డైరక్టర్స్ ను దాటేస్తున్న టాలీవుడ్ డైరక్టర్స్...

హైదరాబాద్, జూన్ 3బాహుబలి సినిమా ఎప్పుడైతే వచ్చిందో అప్పటినుంచి తెలుగు సినిమాల హవా ఇండియా వైడ్ గా కొనసాగుతుంది. ఇప్పటికే మన దర్శకులు భారీ పాపులారిటిని సంపాదించుకున్నారు. ఒకప్పుడు ఇండియాలో స్టార్ డైరెక్టర్లు ఎవరు అంటే బాలీవుడ్ దర్శకుల పేర్లు చెప్పారు. కానీ ఆయా దర్శకులకు ఒక్కొక్కరికి మన ఒక్కొక్క దర్శకుడు చెక్ పెడుతూ వచ్చాడు. ముఖ్యంగా రాజ్ కుమార్ హిరానీ లాంటి స్టార్ డైరెక్టర్ కి వరుస సక్సెస్ లను సాధిస్తూ తనకెదురుగా ఎవరు లేరు అనేంతలా పేరును సంపాదించుకున్నాడు. కానీ అతనికి రాజమౌళి బాహుబలి సినిమాతో చెక్ పెట్టాడు. ఇక బాహుబలి 2 సినిమాతో బాలీవుడ్ దర్శకులందరిని ఒకేసారి పక్కన పెట్టేసిన రాజమౌళి ఇండియాలో నెంబర్ వన్ డైరెక్టర్ గా మారాడు?కమర్షియల్ సినిమాలతో సక్సెస్ ను సాధించే రోహిత్ శెట్టికి సుకుమార్ చెక్ పెట్టాడు. 'పుష్ప 2' సినిమాతో 1850 కోట్లకు పైన కలెక్షన్స్ ను రాబట్టి తెలుగు దర్శకులు కమర్షియల్ సినిమాలు చేస్తే ఎలా ఉంటుందో వాళ్లందరికి చూపించాడు?ఇక బాలీవుడ్ హీరో తోనే అనిమల్ సినిమా చేసి ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా?ఆయన సైతం బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అయిన సంజయ్ లీలా భన్సాలీ కి చెక్ పెట్టాడు? ఇక నాగ్ అశ్విన్ లాంటి దర్శకుడు సైతం ఇండస్ట్రీలో ఉన్న మిగతా దర్శకులందరికి చెక్ పెట్టాడు. ఇలా మన దర్శకుల హవా కొనసాగడమే కాకుండా బాలీవుడ్ దర్శకులను సైతం డామినేట్ చేస్తూ మనవాళ్ళు ముందుకు దూసుకెళ్లడం అనేది నిజంగా ప్రతి ఒక్కరిని ఆనందానికి గురిచేస్తుంది.ఇక అలాంటి దర్శకులు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి మరింత మంది రావాలని బాలీవుడ్ ఇండస్ట్రీ షేక్ అయ్యేలా మనవాళ్లు సినిమా చేయాలని బాలీవుడ్ హీరోలు సైతం మనవాళ్ళతో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు.ఇక మొత్తానికైతే తెలుగు సినిమా ఇండస్ట్రీ ఇప్పుడు టాప్ పొజిషన్లో కొనసాగడమే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీ ని శాసించే స్థాయికి వెళ్ళిపోయింది? ఇప్పటికే సల్మాన్ ఖాన్ లాంటి స్టార్ హీరో సైతం మన తెలుగు దర్శకుడైన వంశీ పైడిపల్లి తో సినిమా చేస్తున్నాడు. అమిర్ ఖాన్ సైతం తెలుగు దర్శకుల మీద ఎక్కువగా ఫోకస్ చేస్తున్నాడు. కానీ అతనితో సినిమా చేయడానికి పెద్దగా ఎవరు ఇంట్రెస్ట్ ని చూపించడం లేదు?

# తుమ్మిడిహట్టి అనేది రేవంత్ రెడ్డి డైవర్షన్ గేమ్

హైదరాబాద్తుమ్మిడిహట్టి అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ గేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్పుడు అతను కూర్చుంటున్న ఆఫీసులోనే గతంలో మహారాష్ట్ర ప్రభుత్వాలు తుమ్మిడిహట్టి ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తుకు పెంచడానికి ఒప్పుకోము అని రాసిన లేఖలు ఉన్నాయని అన్నారు.బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు ఒప్పించలేకపోయారు. అంత పట్టుదల ఉంటే పోయి మహారాష్ట్ర సీఎం ఇంటి ముందు నిరహార దీక్ష చేయండని కేటీఆర్ సలహా ఇచ్చారు.ఏప ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యాలపై కేటీఆర్ స్పపందించారు. దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ పాఠాలు చెప్పాల్సిన పనిలేదు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు కదం తొక్కిన నేల తెలంగాణ అని అన్నారు. సోదరుడిగా వస్తే ఇంటికి పిలిచి హైదరాబాద్ బిర్యానీ పెడతా. కానీ, సెక్రటేరియట్ లో కూర్చుని పెత్తనం చేస్తామంటే ఒప్పుకోమని అన్నారు

# నెల రోజులు టీ మానేస్తే, ఊహించని విధంగా..!!

టీ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమైంది. చాలా మంది ప్రతిరోజూ ఉదయం మంచం మీద నుండి లేచిన వెంటనే టీ తాగి నిద్రలేవడం ఇష్టపడతారు. అదే సమయంలో, చాలా మంది అల్పాహారం సమయంలో కూడా టీ తాగుతారు. కొంత మంది టీకి ఎంతగా బానిసలయ్యారంటే, రోజుకు 3 నుండి 4 సార్లు టీ తాగుతారు. అయితే, ఇంతగా అలవాటు పడిన వారు 30 రోజులు టీ మానేస్తే శరీరం అద్భుతమైన రీబూట్ ప్రక్రియకు లోనవుతుంది.



ఊహించని మార్పు కనిపిస్తుంది. ఈ 30 రోజుల ఛాలెంజ్ పైన నిపుణులు ఆసక్తి కర అంశాలను వెల్లడిస్తున్నారు. టీ ప్రియులకు, ఒక నెల పాటు టీ తాగకుండా ఉండటం పెద్ద సవాలుగా ఉంటుంది. కానీ, టీ తాగాలనే కోరికను అరికట్టడం వల్ల వారి ఆరోగ్యానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఈ మార్పు బాహ్య సౌందర్యానికే కాకుండా శరీరంలోని ప్రతి కణాన్నీ పునరుజ్జీవింపజేస్తుంది. కళ్ల కింద నలుపు మాయమై, ముఖం యవ్వనంగా మారుతుంది. లోలోపల అవయవాలు కూడా మరింత చురుగ్గా పనిచేస్తాయి. రక్తప్రసరణ మెరుగుపడి, మంచి నిద్రపట్టడంతోపాటు తెలియకుండానే మనలో ఒక కొత్త ఉత్సాహం ఉరకలేస్తుంది. టీలో ఉండే కెఫీన్ మన శరీరం నుంచి నీటిని త్వరగా బయటికి పంపించేస్తుంది. దీంతో చర్మం పొడిబారినట్లు కనిపిస్తుంది. కాబట్టి టీ మానేయడం వల్ల శరీరంలో నీటి శాతం స్థిరంగా ఉండి, చర్మకణాలకు తగిన తేమ అందుతుంది. తద్వారా ముఖం, బుగ్గలు తాజాగా మెరుస్తూ ఉంటాయి. ఇక టీ మానేసి నీళ్లు, హెర్బల్ డ్రింక్స్ తాగడం వల్ల లివర్, కిడ్నీలు చురుగ్గా పనిచేసి, రక్తాన్ని సమర్థంగా శుద్ధి చేస్తాయి.టీలో సాధారణంగా కలిపే పాలు, చకెర మొటిమలకు మంచి మిత్రులు. చకెర తీసుకోవడం వల్ల ఇన్సులిన్ ఒకసారిగా పెరుగుతుంది. ఇది చర్మంలోని నూనె గ్రంథులను ప్రేరేపించి ముఖంపై ఎకువ నూనె ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయి. ఇక పాలలోని హార్మోన్లు మొటిమలను ప్రేరేపిస్తాయి. టీ మానేయడం వల్ల నూనె ఉత్పత్తి తగ్గి కొత్త మొటిమలు రావడం నెమ్మదిస్తుంది. కళ్ల కింద నలుపు రావడానికి ప్రధాన కారణం నిద్రలేమి. టీలో ఉండే కెఫీన్ నిద్రను కలిగించే మెదడులోని అడెనోసిన్‌ను అడ్డుకుంటుంది. టీ మానేయడం వల్ల శరీరం సహజమైన నిద్ర సైకిల్‌కు చేరుకుంటుంది. గాఢ నిద్ర పట్టడం వల్ల కళ్ల చుట్టూ ఉండే రక్తనాళాలు విశ్రాంతి పొందుతాయి. ఫలితంగా కళ్ల కింద డార్క్‌నెస్, కళ్ల కింద వాపు కూడా తగ్గుతుంది. అయితే ఒక్కసారిగా టీ మానేస్తే మొదటి వారం రోజులు కొంచెం ఇబ్బందిగా ఉండొచ్చు. తేలికపాటి తలనొప్పి, నీరసం, చిరాకు ఉండొచ్చు. అలాంటప్పుడు నెల రోజుల పాటు టీకి బదులుగా గోరువెచ్చని నీళ్లు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటికిపోయి సత్ఫలితాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సూపర్ టేస్టీ కరివేపాకు పొడి.. ఇలా ఈజీగా చేసుకోండి..!



మనం సాధారణంగా కూరలు, పప్పు, చారు ఇలా ఏ వంట వండినా అందులో తప్పకుండా రెండు రెమ్మల కరివేపాకు వేస్తుంటాం. ఇలా వంటల్లో కరివేపాకు వేసుకోవడం వల్ల కమ్మదనం పెరుగుతుంది. అలాగే కరివేపాకులను రోజూ తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనం అని నిపుణులు చెబుతున్నారు. కరివేపాకులను తినడం వల్ల గుడ్ బ్యాక్టీరియా పెరుగుతుందని అజీర్ణం, కడుపుబ్బరం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయని సూచిస్తున్నారు. అలాగే కరివేపాకు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. మరి కరివేపాకుతో చాలామంది చట్నీ చేసుకుంటారు. ఇంకొంతమంది కరివేపాకు పొడి కూడా చేసుకుంటారు. మరి ఇంట్లోనే ఈజీగా కరివేపాకు పొడి ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం..కరివేపాకు పొడి తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. కరివేపాకు ఒక పెద్ద కప్పు(శుభ్రంగా కడిగి పెట్టినవి), వెల్లుల్లి రెబ్బలు 6 నుంచి 8 పొట్టు తీసినవి, ఎండుమిర్చి 10 నుంచి 12 కారానికి తగినంత, ధనియాలు ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర అర టేబుల్ స్పూన్, పల్లీలు ఒక టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, ఇంగువ చిటికెడు తీసుకోవాలి. ఇక తయారీ విధానం చూస్తే.. ముందుగా కరివేపాకు ఆకులను శుభ్రంగా కడిగి, తేమ లేకుండా పూర్తిగా ఆరబెట్టుకోవాలి.ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టుకోవాలి. అందులో జీలకర్ర, ఎండుమిర్చి, పల్లీలు, వెల్లుల్లి రెబ్బలను వేసి దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు అదే పెనంలో కరివేపాకు ఆకులను వేసి అవి క్రిస్పీగా అయ్యేంత వరకూ వేయించుకోవాలి. చివరగా ఇంగువ వేసి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు వేయించిన పదార్థాలను పూర్తిగా చల్లారాక వాటిని మిక్సీ జార్ లో వేసి తగినంత ఉప్పు చేర్చి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు తయారైన కరివేపాకు పొడిని గాలి చొరబడని డబ్బాలో భద్ర పరచుకోవాలి. ఈ కరివేపాకు పొడిని వేడి వేడి అన్నంతో కలిపి తింటే సూపర్ టేస్టీగా ఉంటుంది.

# నెల్లూరు స్టైల్ 'నెత్తళ్ల పులుసు'.. ఇలా చేస్తే గిన్నె మొత్తం ఊడ్చేస్తారు..!

చేపల కూర అనగానే చాలామందికి నోరూరుతుంది. ముఖ్యంగా తీర ప్రాంతాల ప్రజలు చేపలను ఎక్కువగా తింటారు. చేపలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా చేస్తుంటారు. ఆంధ్రా స్పెషల్, నెల్లూరు స్పెషల్, తెలంగాణ స్పెషల్ ఇలా ప్రాంతాన్ని బట్టి రుచి మారిపోతూ ఉంటుంది. అయితే నెల్లూరు స్టైల్ చేపల పులుసుకు ఉన్న క్రేజే వేరు.. ఈ చేపల పులుసు చాలా టేస్టీగా ఉ ంటుంది. మరి నెల్లూరు స్టైల్ లో నెత్తళ్ల పులుసు ఎప్పుడైనా ట్రై చేశారా..? నెత్తళ్ల పులుసు ఇలా చేస్తే గిన్నె మొత్తం ఊడ్చేస్తారు. నెత్తళ్ల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు.. తయారీ విధానం గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. నెత్తళ్ల చేపల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే ముందుగా నెత్తళ్లు చిన్నవి 500 గ్రాములు, చింతపండు పెద్ద



నిమ్మకాయ సైజంత, మామిడికాయ ముక్కలు ఒక కప్పు, ఉల్లిపాయలు రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి, టమాటోలు రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి, పచ్చిమిర్చి నాలుగు, మసాలా దినుసులు(పోపు కోసం) ఆవాలు, జీలకర్ర, మెంతులు, కరివేపాకు(కొద్దిగా) తీసుకోవాలి, అలాగే పసుపు పావు టీ స్పూన్, కారం రెండు టీ స్పూన్ లు లేదా రుచికి తగినంత, ఉప్పు రుచికి తగినంత, కొత్తిమీర గార్నిష్ కోసం తీసుకోవాలి. ఇప్పుడు నెత్తళ్ల పులుసు తయారీ విధానం చూస్తే ముందుగా ఒక గిన్నెలో నూనె వేడి చేసి పోపు దినుసులు వేసి చిటపటాలాడించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఇప్పుడు టమాటో ముక్కలు, పసుపు, కారం, చింతపండు రసం, ఉప్పు, మామిడికాయ ముక్కలు వేసి ఉడికించుకోవాలి. పులుసు మరిగిన తర్వాత నెత్తళ్లు చేపలు వేసి తక్కువ మంటపై ఉడికించుకుని దింపేస్తే సరి.. చివరగా కొత్తిమీర గార్నిష్ చేసుకుంటే చాలు.. సూపర్ టేస్టీ నెత్తళ్ల పులుసు రెడీ అయినట్టే..

# స్ట్రాబెర్రీ.. పోషకాల ఖజానా





ఎంతో ఇష్టంగా తినే పండ్లలో ఒకటి.. స్ట్రాబెర్రీ. చూడగానే నోరూరించే ఈ పండ్లు రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాలలోనూ ముందుంటాయి. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి ఇందులో. ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి ఇవన్నీ. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది, జీర్ణక్రియను చురుగ్గా పనిచేస్తుంది.

చర్మానికి సహజమైన కాంతి అందుతుంది. పిల్లలు, పెద్దలు ఆస్వాదించడానికి ప్రకృతి సిద్ధమైన స్నాక్‌గా కూడా వీటిని తీసుకోవచ్చు. పచ్చిగా తిన్నా, స్మూతీలలో వాడినా, అల్పాహారంలో భాగంగా చేసుకున్నా, సాయంత్రం వేళ స్నాక్స్ గా తీసుకున్నా స్ట్రాబెర్రీలు.. శరీరానికి అవసరమైన పోషణ, కావాల్సిన ఎనర్జీని అందిస్తాయి.

**స్ట్రాబెర్రీల్లో..**

స్ట్రాబెర్రీలు తక్కువ కేలరీలను కలిగి ఉన్నప్పటికీ, కీలక పోషకాలతో సమృద్ధిగా నిండి ఉంటాయి. విటమిన్ సీ అధిక స్థాయిలో ఉంటుంది. దీనివల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. చర్మం నిగారింపును సంతరించుకు ంటుంది. అలాగే ఇవి జీర్ణక్రియకూ సహాయపడతాయి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఎందుకంటే అవి డైటరీ ఫైబర్‌కు మంచి వనరు.అ ంతేకాదు, యాంథోసైనిన్లు, ఫ్లేవనా యిడ్లు, ఫెనోలిక్ యాసిడ్ల వంటి వివిధ ఫైటోకెమికల్స్ యాంటీఆ క్సిడెంట్లుగా, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్లుగా పని చేస్తాయి. చాలా తీపి పండ్లతో పోలిస్తే, స్ట్రాబెర్రీల్లో లోయర్ మిడిల్ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతుంది. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తీసుకోవడం గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు సైతం సూచిస్తున్నాయి. ఈ పండ్లలోని ఫ్లేవనాయిడ్లు, యాంథోసైనిన్లు రక్తపోటును తగ్గించడం, చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, మొత్తం రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో సంపూర్ణంగా సహాయపడతాయి.

**యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాలు**

స్ట్రాబెర్రీలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించగలుగుతాయి. ఫ్రీ రాడికల్స్.. కణాల వృద్ధాప్యం, కడుపులో మంట (ఇన్ఫ్లమేషన్)కు దోహదపడే అస్థిర అణువులు. స్ట్రాబెర్రీలు తీసుకోవడం వల్ల అందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఫైబర్, ఫైటోకెమికల్స్ సమృద్ధిగా ఉండటం వల్ల, స్ట్రాబెర్రీలు పేగు మైక్రోబయోమ్‌కు మద్దతు ఇస్తాయి. క్రమంగా జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇవి ప్రయోజనకరమైన పేగు బాక్టీరియాకు ఆహారాన్ని అందించి జీర్ణ సౌలభ్యాన్ని పెంపొందిస్తాయి.

**చర్మ ఆరోగ్యం..**

విటమిన్ సీ కొల్లాజెన్ ఉత్పత్తిలో స్ట్రాబెర్రీ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు.. అల్ట్రా వయోలెట్ కిరణాలు, వాయు కాలుష్యం వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడతాయి కూడా. స్ట్రాబెర్రీల్లోని ఫ్లేవనాయిడ్లు వయస్సు సంబంధిత జ్ఞాపక శక్తి క్షీణతను తగ్గించడం ద్వారా మెదడు ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, దీర్ఘకాలిక నాడీ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయడానికీ సహకరిస్తాయి.

# పల్లీ రైస్ ఇలా తయారుచేస్తే మెతుకు కూడా మిగల్చరు!

వేగంగా, రుచికరంగా లంచ్ బాక్స్ లోకి టేస్టీ, స్పైసీ మంచి పౌష్టికాహారం తినాలనుకుంటే పల్లీల అన్నం చాలా మంచి రెసిపీ. పల్లీల రైస్ ను మిగిలిన అన్నంతో సులభంగా తయారుచేయవచ్చు. ఇది చల్లారిన తర్వాత కూడా రుచిగా ఉంటుంది. చూడటానికి బాగుంటుంది, దీనికి వేరే సైడ్ డిష్ కూడా అవసరం లేదు. ఇకపల్లీల అన్నం ఎలా తయారు చేస్తారో ఒకసారి చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు:**

వేరుసెనగపప్పు: 1/4 కప్పు నువ్వులు: 1/4 కప్పు ఎండు మిర్చి: 4 పచ్చి కొబ్బరి (తురిమినది): 1/4 కప్పుఉడికించిన అన్నం: 1 కప్పు ఉప్పు: తగినంత నూనె: 1/4 కప్పు ఆవాలు: 1/2 టీస్పూన్మినపప్పు: 1 టీస్పూన్శెనగపప్పు: 1 టీస్పూన్కరివేపాకు: 2 రెమ్మలు

**తయారీ విధానం**

ముందుగా స్టవ్ వెలిగించి ఒక పాన్ పెట్టి, పాన్ లో పావు కప్పు వేరు శనగపప్పు, పావు కప్పు నువ్వులు, నాలుగు ఎండు మిర్చి వేసి సిమ్ లో పెట్టి దోరగా వేయించుకోవాలి. తరువాత అదే పాన్ లో తురుముకున్న పచ్చి కొబ్బరి కూడా వేసి వేయించుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని కాస్త పలుకుగా గ్రైండ్ చేసుకోవాలి.ఇలా చేస్తే పల్లీల రైస్ సూపర్ఆపై అదే పాన్ లో నూనె వేసుకుని తాలింపు గింజలు వేసి పోపు చేసుకోవాలి. ఈ పోపులో కరివేపాకు కూడా వేసుకోవాలి ఆపై అందులో అన్నం వేసి, మిక్సీ చేసి పెట్టుకున్న పొడిని, రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా కలుపుకోవాలి. ఆపై స్టవ్ ఆఫ్



చేసి సర్వ్ చేసుకోవటమే. ఇది లంచ్ బాక్సులోకి చాలా బాగుంటుందిటేస్టీ, హెల్దీ పుదీనా రైస్.. ఇలా చేస్తే మొత్తం ఖాళీ చేస్తారు!టేస్టీ, హెల్దీ పుదీనా రైస్.. ఇలా చేస్తే మొత్తం ఖాళీ చేస్తారు!ఈ టిప్స్ పాటిస్తే టేస్టీ పల్లీల రైస్పల్లీల అన్నం అద్భుతమైన రుచిని పొందాలంటే కొన్ని చిట్కాలు ముఖ్యం. తాలింపులోని పప్పు దినుసులు, వేరుసెనగపప్పును సన్నని సెగపై నెమ్మదిగా, ఎర్రగా, కరకరలాడే వరకు వేయించాలి. ఇలా లోపలి వరకు వేగితేనే అన్నానికి మంచి రుచి వస్తుంది. ముఖ్యంగా, ఎండాకాలంలో పచ్చి కొబ్బరిని నేరుగా అన్నంలో కలిపితే త్వరగా పాడవుతుంది. రుచి తగ్గకుండా, అన్నం చెడిపోకుండా ఉండాలంటే, పచ్చి కొబ్బరిని తాలింపులో వేసి వేయించడం ఉత్తమం.

# చైనీస్ స్టైల్ "పనసకాయ మంచూరియా" ట్రై చేస్తారా..?

చైనీస్ స్టైల్ వంటకాలంటే ఇష్టపడేవారికి పనసకాయ మంచూరియా ఒక అద్భుతమైన ఎంపిక. పచ్చి పనసకాయతో తయారయ్యే ఈ వంటకం బయటకు క్రిస్పీగా, లోపల మెత్తగా ఉండి ప్రత్యేక రుచిని అందిస్తుంది. వెజిటేరియన్లకు ఇది చికెన్ మంచూరియాకు మంచి ప్రత్యామ్నాయంగా చెప్పొచ్చు. సాయంత్రం స్నాక్‌గా, పార్టీ స్టార్టర్‌గా లేదా ఫ్రైడ్ రైస్, నూడుల్స్‌తో సైడ్ డిష్‌గా సర్వ్ చేస్తే అద్భుతంగా ఉంటుంది.పచ్చి పనసకాయలో ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో విటమిన్ అ, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. ఒక్కసారి ఈ పనసకాయ మంచూరియాను ట్రై చేస్తే.. రెస్టారెంట్ స్టైల్ రుచిని ఇంట్లోనే ఆస్వాదించిన ఆనందం మీ సొంతమవుతుంది. ఈ టేస్టీ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా..

**కావలసిన పదార్థాలు..**

పచ్చి పనసకాయ ముక్కలు – 2 కప్పులుకార్న్‌ఫ్లోర్ – 2 టేబుల్ స్పూన్లు

మైదా – 2 టేబుల్ స్పూన్లుఅల్లం-వెల్లుల్లి పేస్ట్ – 1 టీస్పూన్కారం – 1 టీస్పూన్మిరియాల పొడి – ½ టీస్పూన్ఉప్పు – రుచికి సరిపడానూనె – డీప్ ఫ్రైకి సరిపడానూనె – 2 టేబుల్ స్పూన్లువెల్లుల్లి – 1 టేబుల్ స్పూన్ (సన్నగా తరిగినది)అల్లం – 1 టీస్పూన్ (సన్నగా తరిగినది)పచ్చిమిర్చి – 2ఉల్లిపాయ – 1 (చదరపు ముక్కలు)క్యాప్సికం – ½ కప్పుసోయా సాస్ – 1½ టీస్పూన్లురెడ్ చిల్లీ సాస్ – 1 టీస్పూన్టమాటో కెచప్ – 1 టేబుల్ స్పూన్వెనిగర్ – ½ టీస్పూన్ (ఐచ్ఛికం)కార్న్‌ఫ్లోర్ – 1 టీస్పూన్నీరు – ½ కప్పుమిరియాల పొడి – ½ టీస్పూన్ఉప్పు – తగినంతఉల్లికాడలు – 2 టేబుల్ స్పూన్లనువ్వులు – కొద్దిగా (ఐచ్ఛికం)తయారీ విధానం..ముందుగా పచ్చి పనసకాయ ముక్కలను శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పు, పసుపు వేసిన నీటిలో మెత్తగా ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత నీటిని పూర్తిగా వంపేసి, ముక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి.

ఇయ్యాల తెలంగాణ



# పంచాయితీల తర్వాతే మున్సిపాల్టీలు

విశాఖపట్టణం, జూన్ 3,ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. పంచాయితీతోపాటు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పంచాయతీల పాలకవర్గం ముగిసింది. కొత్తగా ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. మున్సిపాలిటీలకు సైతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా వచ్చారు. అయితే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కూటమి భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఇదే సమయం అని అంచనా వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం స్థానిక ఎన్నికలకు సిద్ధపడుతోంది. ప్రతిచోట వైసీపీ అభ్యర్థి బరిలో ఉండాల్సిందేనని.. లేకుంటే మాత్రం వైసిపి ఇన్చార్జ్ పై వేటు వేస్తామని జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మరోవైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు.కూటమి ప్రభుత్వపరంగా ఈనెల కీలకం. ముఖ్యంగా ఇదే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతుందని అంచనా వేస్తోంది. మరోవైపు కొత్త పింఛన్లకు సంబంధించిన బిగ్ అప్డేట్ వచ్చింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరు చేసి.. ప్రజల్లో మరింత సంతృప్తి సాధించి.. ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో కూటమి ఉంది. అయితే జూలై నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ నాలుగు తో పదవీకాలం గడువు ముగిసింది. అప్పటినుంచి ప్రత్యేక అధికారులను నియమించారు. మరోవైపు ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం గడువు ప్రారంభం అయింది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు దక్కేవి. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీలైనంతవరకు పంచాయితీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేసే అవకాశం కనిపిస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకోవద్దు అని జగన్మోహన్ రెడ్డి గట్టిగానే చెప్పారు. అయితే క్యాడర్ మాత్రం విముఖత వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎన్నికలు అంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. పైగా ఆర్థిక భారం తప్పేలా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి చూస్తుంటే తప్పనిసరిగా బరిలో ఉండాల్సిందేనని చెబుతున్నారు. కానీ పార్టీ శ్రేణులు మాత్రం పులివెందుల జడ్పిటిసి ఎన్నికలను గుర్తుచేసుకొని భయపడుతున్నారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 110 కి పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. పట్టణాలతో పాటు నగరాల్లో కూటమికి సంతృప్తికర వాతావరణముంది. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండడంతో అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కూడా కూటమి సత్తా చాటాలని చూస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలు కాకుండా పోటీ చేయించాలన్న ఆలోచనలో వైసిపి ఉంది. కానీ వైసీపీ క్యాడర్ మాత్రం అందుకు సుముఖంగా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టుబడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేయాల్సి ఉంటుంది.ఇటు పార్టీ అగ్రనేతల కామెంట్స్..మరోవైపు ఎస్ఈసీ డెవలప్‌మెంట్స్‌తో..ఏపీలో స్థానిక ఎన్నికల సందడి ఊపందుకుంటోంది. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో టీడీపీ ఈ ఎలక్షన్స్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గెలుచుకున్న స్థానాలను తిరిగి కైవసం చేసుకుని పసుపు జెండా రెపరెపలాడించాలని పట్టుదలతో ఉంది. మహానాడు వేదికపైనా స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. పార్టీ జెండా మోసిన వారికి పోటీ అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు వెళ్లాయంటున్నారు.పార్టీ కోసం కష్టపడిన వారికి కచ్చితంగా టికెట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని సంకేతాలిచ్చారాయన. ఇక ఇదే సందర్భంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా స్థానిక ఎన్నికలపై గురిపెట్టారు. ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, ప్రతి స్థానంలోనూ పోటీ ఉండేలా అభ్యర్థులను ఇప్పటినుంచే రెడీ చేయాలని లీడర్లకు సూచించారు. దీంతో ఒక్కసారిగా ఏపీలో పొలిటికల్ హీట్ కాక రేక రేపుతోంది.స్థానిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల మధ్యే గట్టి పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తోంది. కూటమిలో జనసేన, బీజేపీకి సీట్లు కేటాయించిన చోట..పరిస్థితులు తమకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ భావిస్తోంది. 2021-22లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం స్థానాలను సొంతం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో 100 శాతం స్థానాలను గెలుచుకోవాలని టీడీపీ యోచిస్తోంది. వైసీపీపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన కూడా కీలక స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉంది. ఆయా జిల్లాల నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కీలకమైన వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.మరోవైపు బీజేపీ కూడా తమకు బలం ఉన్నచోట అభ్యర్థులను పోటీలోకి దించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఎన్నికలకు దూరంగా ఉండాలా..లేక పోటీ చేయాలా అనే డైలామాలో ఉన్న వైసీపీ ఇక అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయినట్లు కనిపిస్తోంది. అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఫ్యాన్ పార్టీ..స్థానిక ఎన్నికల్లో గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు సర్వం సిద్ధం చేస్తోందట. రాష్ట్రస్థాయి కీలక నేతల సమావేశంలో స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు జగన్. ముఖ్యంగా ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, అలా జరిగితే నియోజకవర్గ ఇంచార్జ్‌ల ఫెయిల్యూర్‌గా భావించాల్సి వస్తుందని ముఖ్యనేతలను హెచ్చరించారు. దీంతో స్థానిక పోరు విషయంలో తగ్గేదేలే అన్న ఇండికేషన్ పంపించారు వైసీపీ అధినేత జగన్.ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దాదాపు 13 వేల 326 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి న్యాయపరమైన చిక్కుల కారణంగా గతంలో ఎన్నికలు నిర్వహించ లేదు. ఇప్పుడు అన్ని పంచాయతీలకు ఎలక్షన్స్ జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 660 జడ్పీటీసీ స్థానాలు, 10వేల 47కి పైగా ఎంపీటీసీ స్థానాలకు ఎలక్షన్స్ పెట్టనుండటంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. అలాగే రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రకారం 920కు వార్డుల సంఖ్య పెరిగింది. 75 మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 2 వేలకు పైగా వార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ కూడా రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు స్టేట్ ఈసీ కసరత్తు చేస్తోంది.

# కమలానికి ఏమైంది...

నెల్లూరు, జూన్ 3,ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపి తో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారుబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్ భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు. ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు.

# మాకో అవకాశం ఇవ్వండి

విజయవాడ, జూన్ 3, తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. కానీ పదవులు తక్కువ.. ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఇది టీడీపీ నాయకత్వానికి కొంత ఇబ్బందిగా మారే అవకాశముంది. తాము పార్టీ కోసం పడిన కష్టాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ను కలిసి తమ వినతులను సమర్పించారు. తమకు పెద్దల సభలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ నాయకత్వం మాత్రం రాజ్యసభ స్థానాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది.వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్ రావు వంటి నేతలు తమకు రాజ్యసభ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా కీలక కామెంట్స్ చేశారు. తన తర్వాత తన కుటుంబానికి కూడా రాజకీయంగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని అయ్యన్న పాత్రుడు కోరారు. ఇరవై ఐదేళ్ల వయస్సు నుంచి టీడీపీలో సేవలందిస్తున్నానన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన కుటుంబానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. అంటే పరోక్షంగా తన కుమారుడు చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపాలని కోరినట్లు నాయకత్వానికి చెప్పకనే చెప్పినట్లయింది.తెలుగుదేశం పార్టీ కోసం జీవితాంతం పనిచేశానని అయ్యన్న పాత్రుడు భావోద్వేగంగా మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు కూడా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరిన స్పీకర్ అయ్యన్న అందుకు అవకాశమివ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సమయంలో అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలో రాజ్యసభ ఆశావహుల మధ్య అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరి రాజ్యసభకు టీడీపీ నాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది మాత్రం చివరి వరకూ సస్పెన్స్ గా కొనసాగే అవకాశముంది.

# టార్గెట్ 100..జగన నయా లెక్కలు



విజయవాడ, జూన్ 3,రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మారడం సహజం. అయితే భారీ విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లిన పార్టీలు అనూహ్య ఫలితాలు ఎదుర్కొన్నప్పుడు తమ కార్యాచరణను తిరిగి సమీక్షించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలో వై నాట్ 175 అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిన పార్టీ, ఎన్నికల ఫలితాల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడంతో భవిష్యత్ వ్యూహాలపై అంతర్గతంగా మంతనాలు ప్రారంభమైనట్లు సమాచారం.ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశాల్లో నాయకుల మధ్య కొత్త ఎన్నికల లక్ష్యాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో అత్యంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిమిత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొంతమంది నాయకులు 175 స్థానాలపై దృష్టి కేంద్రీకరించడం కంటే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న సుమారు 100 నియోజకవర్గాలను గుర్తించి ప్రత్యేక వ్యూహంతో పని చేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. బలమైన స్థానాల్లో పార్టీ శక్తిని కేంద్రీకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు వివరించినట్లు తెలుస్తోంది.అలాగే ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని మరింత చురుకుగా మార్చడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవాల ఆధారంగా బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ అంశంపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.ఇక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణ రెడ్డిసమావేశంలో లక్ష్యాల సంఖ్యను తగ్గించుకోవడంపై కాకుండా గెలుపు అవకాశాలను పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మద్దతు, సమర్థవంతమైన ప్రచారం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం. మరోవైపు రానున్న కాలంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలు, ముఖ్యంగా పార్టీ అధినేత చేపట్టనున్న పాదయాత్ర తర్వాత రాజకీయ పరిస్థితులను అంచనా వేసి తుది వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఎన్నికల లక్ష్యాల కంటే ప్రజల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంపొందించుకోవడంపైనే ప్రస్తుతం పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# వేలూరు రహదారిపై గాయాలతో వ్యక్తి మృతదేహం లభ్యం

చిలకలూరిపేట,చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో వేలూరు గ్రామం నుండి జాలాది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానిక గ్రామస్తులు గమనించారు. రోడ్డుపై మృతదేహం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు, వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా (హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో) పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు? అసలు అక్కడ ఏం జరిగింది? అనే పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# టీడీపికి కలిసి రాని రాజ్యసభ



విజయవాడ, జూన్ 3, తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల సందడి ఊపందుకుంది. రాష్ట్రంలో కూటమికి ఉన్న భారీ మెజారిటీ కారణంగా ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలనూ కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకే. అయితే, ఈ విజయోత్సాహం నడుమ పార్టీలో ఒక ఆసక్తికరమైన, పాత వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. 1984 లో ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పెద్దల సభకు వెళ్లిన నేతల చరిత్రను గమనిస్తే.. రాజ్యసభ సభ్యులు టీడీపీకి ఎప్పుడూ కలిసి రాలేదు అనే సెంటిమెంట్ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు దాదాపు 46 మంది నేతలు ఆ పార్టీ తరపున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు నిజం పార్టీని నిరంతరం వెంటాడుతోంది. టీడీపీ తరపున ఒకసారి కంటే ఎక్కువసార్లు రాజ్యసభకు వెళ్లిన నేతలలో అత్యధికులు కీలక సమయంలో పార్టీకి హ్యాండ్ ఇచ్చి వలస బాట పట్టారు. నాడు ఎన్టీఆర్ హయాంలో పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పిన పి. ఉపేంద్ర కాలం నుంచి.. నిన్నమొన్నటి సుజనా చౌదరి, సీఎం రమేష్ వరకు ఈ జాబితా చాలా పెద్దదిగానే ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవాల్సిన ఈ పెద్దలు .. సొంత ప్రయోజనాల కోసం లేదా కేసుల భయంతో పార్టీ లైన్ దాటడం ప్రతిసారీ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.టీడీపీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్న 2019 ఎన్నికల తర్వాత ఈ రాజ్యసభ సభ్యుల వలసలు పరాకాష్టకు చేరాయి. అప్పట్లో టీడీపీకి ఉన్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు సుజనా చౌదరి, సి.ఎం. రమేష్, టి.జి. వెంకటేష్, గరికపాటి మోహన్ రావు ఒకేసారి గ్రూప్‌గా మారి, రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని ఏకంగా బీజేపీలో విలీనం చేసేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం రెండు పైగా మూడు వంతుల మెజారిటీని వాడుకుని, అనర్హత వేటు పడకుండా వీరు సేఫ్‌గా కమలం గూటికి చేరిపోయారు. అంతకుముందు చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తులుగా, ఢిల్లీలో పార్టీ ముఖచిత్రాలుగా వెలిగిన వీరే.. పార్టీ ఓడిపోగానే పక్కదారి పట్టడం చంద్రబాబు రాజకీయ వ్యూహాల లోపాన్ని ఎత్తిచూపింది.ఈ వరుస వలసల వెనుక ఉన్న అసలు కారణంపై టీడీపీ క్షేత్రస్థాయి క్యాడర్, సీనియర్ లీడర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఎలక్షన్ల సమయంలో పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్లే గ్రౌండ్ లెవెల్ లీడర్లను పక్కన పెట్టి.. కేవలం ఫండింగ్ చేసేవారికి, తెర వెనుక చక్రం తిప్పే కార్పొరేట్ శక్తులకే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తారనే విమర్శ మొదటి నుండి ఉంది. ఢిల్లీలో లాబీచీలు నడపడానికి, వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి వచ్చే ఇలాంటి పారాచూట్ నేతలకు పార్టీ సిద్ధాంతాల పట్ల గానీ, కార్యకర్తల కష్టం పట్ల గానీ ఎలాంటి నిబద్ధత ఉండదు. అందుకే, అధికారం మారగానే వీరు తమ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి జంప్ అయిపోతుంటారని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం జూన్ 2026 లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మళ్లీ లాబీయింగ్ మొదలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకు ఒక సీటు కేటాయించగా, మిగిలిన మూడు సీట్లు టీడీపీ దక్కించుకోనుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న సానా సతీష్ బాబు తో పాటు పాత కార్పొరేట్ ముఖాలు మళ్లీ సీట్ల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈసారి నారా లోకేష్ నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుండటంతో.. యువతకు, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న బీసీ, ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత తప్పులను పునరావృతం చేయవద్దని కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ స్థాయిలో తన వాయిస్ బలంగా వినిపించాలంటే రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకం. టీడీపీ విషయంలో ఈ సభ్యులు కేవలం పవర్ బ్రోకర్లు గా మిగిలిపోతున్నారనేది నిజం. సురేష్ ప్రభు లాంటి బయటి వ్యక్తులకు కూడా గతంలో టీడీపీ సీటు ఇచ్చింది. ధోరణి మారకపోతే, భవిష్యత్తులో కూడా ఈ సీట్లు పార్టీకి కేవలం తాత్కాలిక అవసరాలకే ఉపయోగపడతాయి తప్ప, నమ్మకమైన లీడర్‌షిప్‌ను తయారు చేయలేవు. చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో కేవలం ఆర్థిక అంగబలాన్ని మాత్రమే చూడకుండా, రాజకీయ అంగబలం, నమ్మకమైన చరిత్ర ఉన్నవారికే పెద్దల సభకు పంపితేనే రాజ్యసభ శాపం నుంచి టీడీపీ బయటపడగలదని టీడీపీ క్యాడర్ అభిప్రాయం.

# మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కోసం కొనసాగుతోన్న గాలింపు

పల్నాడు ,వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. బ్రహ్మనాయుడు కోసం నర్సరావుపేటకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు వచ్చారు.

బ్రహ్మనాయుడు నివాసంలో తనిఖీలు చేసారు. గండిపేటలో దాదాపు రూ.1500 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడుపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ..




# భారత టీ20 కోచ్ రేసులో ఆశిష్ నెహ్రా!

ఐపీఎల్ 2026 ముగిసింది. ప్రస్తుతం భారత క్రికెట్ జట్టు అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌కు సిద్ధమవుతోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమిండియా.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విజయవంతంగా దూసుకెళుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచింది. 2027 వన్డే ప్రపంచ కప్‌నకు కూడా భారత్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో గంభీర్ తర్వాత టీ20 కోచ్ రేసులో ఎవరున్నారనే విషయంపై చర్చ జరుగుతోంది. ఈ



నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్‌కు కోచ్‌గా ఉన్న ఆశిష్ నెహ్రా సరైన వ్యక్తి అని అభిప్రాయపడ్డాడు. 'ఆశిష్ నెహ్రా పూర్తిగా క్రికెట్‌పై దృష్టి పెట్టే వ్యక్తి. జట్టులోని సమస్యలను స్పష్టంగా అర్థం చేసుకుని పరిష్కరించగలడు. జట్టును గెలిపించడం కోసం పరితపిస్తుంటాడు. ఇతరులను సంతోషపెట్టేందుకు రాజకీయాలు చేయడు. ఇదే విషయాన్ని ప్లేయర్లు కూడా గమనిస్తారు. అతడి నేతృత్వంలో జట్టు విజయం సాధించినా.. ఆ క్రెడిట్ ఎంతమాత్రం తీసుకోవడానికి ఇష్టపడడు. సాధారణ వ్యక్తిలా తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతాడు. భవిష్యత్తులో భారత టీ20 కోచ్ కోసం వెతకాల్సి వస్తే.. ఆశిష్ నెహ్రా అత్యుత్తమ ఎంపిక అవుతాడు. అతడి రికార్డు అద్భుతం. నెహ్రా జట్టులోకి వస్తే బౌలింగ్ కోచ్‌గా కాదు.. నేరుగా హెడ్ కోచ్‌గానే రావాలి. వేర్వేరు కెప్టెన్లతో జట్టును విజయవంతంగా నడిపించిన వ్యక్తికి అదే సరైన స్థానం' అని సంజయ్ మంజ్రేకర్ వెల్లడించాడు.ప్రస్తుతం ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ప్రధాన కోచ్‌గా ఉన్న నెహ్రా.. జట్టును విజయవంతంగా నడిపిస్తున్నాడు. 2022లో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన గుజరాత్ టైటాన్స్ ఒకసారి ఛాంపియన్‌గా నిలవగా.. మరో రెండు సార్లు ఫైనల్‌కు చేరింది. మరోసారి ప్లే ఆఫ్స్ ఆడింది. ఈ విజయాల వెనుక నెహ్రా కీలక పాత్ర పోషించాడు.

# ఆ మ్యాచ్‌కే కాకుండా టోర్నీ హైప్ తీసుకురండి: మంధాన

మరికొన్ని రోజుల్లో మహిళల టీ20 ప్రపంచ కప్2026 సంగ్రామం జరగనుంది. జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో జూన్ 14న బర్మింగ్‌హామ్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌పై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో టీమిండియా వుమెన్స్ వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అభిమానులు, మీడియాకు కీలక విజ్ఞప్తి చేసింది. కేవలం భారత్, పాక్ మ్యాచ్‌కే హైప్ క్రియేట్ చేయొద్దని, ఈ ప్రపంచ కప్ మొత్తానికి ఆదరణ దక్కేలా ప్రచారం చేయాలని కోరింది.భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడవ టీ20ఐ అనంతరం జరిగిన పోస్ట్ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మంధాన మాట్లాడారు. ' కామన్వెల్త్ గేమ్స్ 2022లో భాగంగా బర్మింగ్‌హామ్ వేదికగా భారత్, పాక్ తలపడ్డాయి. ఆ మ్యాచ్ టిక్కెట్లన్నీ వేగంగా అమ్ముడయ్యాయి. కేవలం భారత్-పాకిస్థాన్ మ్యాచ్ గురించే కాకుండా ఈ టీ20 ప్రపంచ కప్‌నకు కూడా ప్రచారం కల్పించాలని ఆశిస్తున్నాను. కేవలం ఒక మ్యాచ్‌కే మనం ప్రచారం కల్పించాల్సిన అవసరం లేదు. దానికి ఇప్పటికే చాలా ప్రచారం జరిగింది. చాలా మంది క్రికెట్ ప్రియులు ముందుకు వచ్చి మాకు మద్దతు ఇస్తారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. వారి కోసం మేం మంచి ప్రదర్శన



ఇవ్వగలమనే నమ్మకం ఉంది" అని మంధాన పేర్కొంది.టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్-ఎలో ఉన్న భారత్.. లీగ్ దశలో తొలి మ్యాచ్ పాకిస్థాన్‌తో ఆడనుంది. 17న నెదర్లాండ్స్, 21న దక్షిణాఫ్రికా, 25న బంగ్లాదేశ్, 28న ఆస్ట్రేలియాతో టీమిండియా తలపడనుంది. ఇక, భారత జట్టు విషయానికొస్తే.. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను 2-1తో చేజార్చుకుంది. అంతకుముందు, టీమిండియా దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 4-1 తేడాతో ఓటమి చవిచూసింది.

# ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్.. ప్యాట్ కమిన్స్ సంచలన నిర్ణయం

ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ చక్కటి ప్రదర్శన చేసింది. ఎలిమినేటర్ మ్యాచ్ లో రాజస్థాన్ చేతిలో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో తదుపరి సీజన్ కోసం తమ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం ప్రారంభించింది. అయితే ఈ లోపే ఎస్ఆర్ హెచ్ జట్టుకు భారీ షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. ఆ జట్టు కెప్టెన్, ఆస్ట్రేలియా స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2027 సీజన్ నుంచి తప్పుకునే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై కమిన్స్ స్వయంగా చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఓ అంతర్జాతీయ మీడియాతో ప్యాట్ కమిన్స్ మాట్లాడుతూ.. 'వచ్చే ఏడాది నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది నా దేశం తరఫున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే నేనే ఏ విషయాన్ని ధ్రువీకరించలేను, ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాల బారిన పడవచ్చు' అని కమిన్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.ఈ కమిన్స్ చేసిన ఈ వ్యాఖ్యలపై క్రికెట్ నిపుణులు పలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు 2027 అత్యంత కీలకం కానుంది. ఆ ఏడాది ఆస్ట్రేలియా జట్టు ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్




2027 ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్లకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. దేశం తరఫున ఈ పెద్ద టోర్నమెంట్లన్నింటికీ అందుబాటులో ఉండటం కోసం ఐపీఎల్ 2027కు దూరం కావాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆ ఉద్దేశంతోనే పై వ్యాఖ్యలు చేశాడని క్రీడా నిపుణులు అంటున్నారు.

# ప్రపంచ నం.1 కార్ల్‌సన్‌కు మరో షాక్.. చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద

భారత యువ గ్రాండ్ మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద మరోసారి ప్రపంచ నంబర్ వన్ చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌కు షాకిచ్చాడు. నార్వే చెస్ 2026 టోర్నీలో క్లాసికల్ విభాగంలో కార్ల్‌సన్‌ను రెండోసారి ఓడించి చరిత్ర సృష్టించాడు. దీంతో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్‌ను రెండుసార్లు క్లాసికల్ గేమ్‌లో ఓడించిన తొలి భారత ప్లేయర్‌గా ప్రజ్ఞానంద అరుదైన ఘనత సాధించాడు.స్వదేశంలో వరుసగా రెండోసారి ఓటమి చవిచూడటంతో కార్ల్‌సన్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రజ్ఞానందతో కరచాలనం చేసి.. నిరాశతో అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియోలు సోషల్



మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజా విజయంతో ప్రజ్ఞానంద 12 పాయింట్లతో మూడో స్థానానికి ఎగబాకి నార్వే చెస్ టైటిల్‌కు అత్యంత చేరువలో నిలిచాడు. మరోవైపు టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉన్నప్పటికీ.. డిఫెండింగ్ ఛాంపియన్ కార్ల్‌సన్ టైటిల్ రేసులో వెనకపడ్డాడు. ఈ టోర్నీలో కార్ల్‌సన్ ఇప్పటివరకు నాలుగు క్లాసికల్ మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. అందులో రెండు ఓటములు ప్రజ్ఞానంద చేతిలోనే కావడం గమనార్హం.నార్వే చెస్ 2026 టోర్నీ పట్టికలో అమెరికా గ్రాండ్ మాస్టర్ వేస్‌లీ సో 14 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ అలీరెజా ఫిరౌజా 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. భారత్‌కు చెందిన మరో ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌పై అలీరెజా క్లాసికల్ గేమ్‌లో గెలిచాడు. కాగా గుకేశ్‌కు ఇది టోర్నీలో మూడో క్లాసికల్ ఓటమి. ప్రస్తుతం అతడి ఖాతాలో 8 పాయింట్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా గరిష్ఠంగా 14 పాయింట్లకే చేరుకోగలడు. దీంతో టైటిల్ ఆశలు దాదాపు ముగిసినట్టే అయితే ప్రజ్ఞానందకు మాత్రం టైటిల్ అవకాశాలు సజీవంగానే ఉన్నాయి. కార్ల్‌సన్‌ను అతడి సొంతగడ్డపై రెండుసార్లు ఓడించిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇప్పుడు నార్వే చెస్ కిరీట పోరులో బలమైన పోటీదారుడిగా అవతరించాడు. కాగా చివరి రెండు రౌండ్లు ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# 40 రోజులు.. 12 మ్యాచ్‌లు.. న్యూజిలాండ్ పర్యటనకు టీమిండియా




భారత క్రికెట్ అభిమానులకు క్రేజీ న్యూస్. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు 2026-2027 అంతర్జాతీయ హోం సీజన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇందులో భారత్‌తో జరిగే సిరీస్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు టీమిండియా.. న్యూజిలాండ్‌కు వెళ్లనుంది. ఇందులో భాగంగా ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌ల్లో ఇరుజట్లు తలపడనున్నాయి. మొత్తం 3 ఫార్మాట్లు.. 40 రోజులు.. 12 మ్యాచ్‌లు.. భారత అభిమానులకు పండుగే పండుగ! అయితే న్యూజిలాండ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద పర్యటన కావడం విశేషం. గతంలో ఏ దేశ క్రికెట్ జట్టు కూడా న్యూజిలాండ్ పర్యటనలో ఇన్ని మ్యాచ్‌లు ఆడలేదు. అక్టోబర్ 22న టీ20, నవంబర్ 4న వన్డే, నవంబర్ 19 నుంచి టెస్టు సిరీస్‌లు ప్రారంభం కానున్నాయి.

పూర్తి షెడ్యూల్ ఇదే..

టీ20 సిరీస్:

తొలి టీ20- అక్టోబర్ 22, క్రైస్ట్‌చర్చ్‌రెండో టీ20- అక్టోబర్ 24, క్రైస్ట్‌చర్చ్‌మూడో టీ20- అక్టోబర్ 27, వెల్లింగ్టన్ నాలుగో టీ20- అక్టోబర్ 30, ఆక్లాండ్‌ఐదో టీ20- నవంబర్ 1, హామిల్టన్

వన్డే సిరీస్:

తొలి వన్డే- నవంబర్ 4, ఆక్లాండ్‌రెండో వన్డే- నవంబర్ 7, వెల్లింగ్టన్‌మూడో వన్డే- నవంబర్ 10, హామిల్టన్ నాలుగో వన్డే- నవంబర్ 13, మౌంట్ మాంగనూయిఐదో వన్డే- నవంబర్ 15, మౌంట్ మాంగనూయి

టెస్ట్ సిరీస్:

తొలి టెస్టు- నవంబర్ 19-23, వెల్లింగ్టన్‌రెండో టెస్టు- నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు, క్రైస్ట్‌చర్చ్

# గంగూలీ భద్రతను తగ్గించిన బెంగాల్ ప్రభుత్వం.. ఎందుకంటే..

టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ భద్రతను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తగ్గించింది. ఆయనకు ఇంతకుముందు ఇస్తున్న 'జెడ్' కేటగిరీ భద్రతను ఉపసంహరించుకుని, 'వై' (జ) కేటగిరీకి కుదించినట్లు రాష్ట్ర ప్రభుత్వ భద్రతా విభాగం తాజాగా ప్రకటించింది. గంగూలీ భద్రత గురించి పునఃసమీక్ష చేసిన అనంతరం రాష్ట్ర భద్రతా విభాగ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.2023లో మమతా బెనర్జీ సర్కార్ గంగూలీకి ఉన్న 'వై' కేటగిరీ భద్రత నుంచి 'జెడ్' కేటగిరీకి పెంచింది. జెడ్ కేటగిరీ ఉన్నంత కాలం గంగూలీకి 8 నుంచి10 మంది పోలీసు సిబ్బంది రక్షణ ఉండేది. ఇప్పుడు వై కేటగిరీకి తగ్గించడంతో ఆయనకు భద్రత కల్పించే పోలీసుల సంఖ్య కూడా తగ్గనుంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వివిధ ప్రముఖులకు సంబంధించిన భద్రతపై అధికారులు సమీక్షించారు. అలానే కొత్త భద్రతా నిబంధనల ప్రకారం.. గంగూలీకి



ఉన్న ముప్పు 'జెడ్' కేటగిరీ భద్రత కిందకు రాదు.గంగూలికి అవసరమైన పోలీసు భద్రత కొనసాగుతున్నప్పటికీ, 'జి' కేటగిరీ కింద కేటాయించిన విస్తృతమైన వీఐపీ కార్డన్, హోంగార్డులు, ప్రత్యేక వ్యక్తిగత భద్రతా అధికారుల (పీఎస్‌ఓల) సంఖ్యను తగ్గించారు. గంగూలీ భద్రత తగ్గింపు అనేది కేవలం ఒక ప్రత్యేక నిర్ణయం కాదని, రాష్ట్రవ్యాప్తంగా వీఐపీ భద్రతా నిబంధనల పునర్వ్యవస్థీకరణలో భాగమేనని రాష్ట్ర అధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి ఎలాంటి రాజకీయాలు ఆపాదించవద్దని సూచించారు.


# కోహ్లీని వైభవ్ అవమానించలేదు: హర్ష భోగ్లే


ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వివాదానికి దారి తీసింది. ఆ వీడియోలో వైభవ్.. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీని అవమానించేలా మాట్లాడినట్లు ఉంది. విరాట్ గురించి ప్రముఖ వ్యాఖ్యాత హర్ష భోగ్లే ఒక ప్రశ్న అడిగితే.. కోహ్లీ చాలా నెమ్మదిగా ఆడతాడంటూ వైభవ్ దానికి సమాధానం ఇచ్చినట్లుగా చూపించారు. ఈ వీడియోపై హర్ష భోగ్లే ఎక్స్ వేదికగా క్లారిటీ ఇచ్చాడు. ఆ వీడియోలో వాస్తవం లేదని.. అది ఫేక్ వీడియో అని స్పష్టం చేశాడు.'నాకు, వైభవ్‌కు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియో క్లియర్‌గా ఫేక్. అందులో వైభవ్‌ను మర్యాద తెలియనివాడిగా, అహంకారిగా, అసభ్యంగా చూపించే ప్రయత్నం చేశారు. నేను అతడిని ఆ ప్రశ్న అడగలేదు. అతడు కూడా అలాంటి సమాధానమేదీ ఇవ్వలేదు. ఉద్దేశపూర్వకంగానే ఆ వీడియోను క్రియేట్ చేశారు. ఎంతో వినయంగా ఉండే ఓ యువ క్రికెటర్‌పై ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం దారుణం' అని హర్ష భోగ్లే పేర్కొన్నాడు.'మీరు కూడా విరాట్ కోహ్లీలా క్రికెట్ ప్రపంచాన్ని ఓ రాజులా ఏలాలి అనుకుంటున్నారా?' అని హర్ష భోగ్లే వైభవ్‌ను అడిగాడు. 'నాకు విరాట్ భయ్యా అంటే చాలా ఇష్టం. కానీ నాకు అతడి రికార్డ్స్ అంటే ఇష్టం లేదు. అతడు చాలా నెమ్మదిగా ఆడతాడు. హాఫ్ సెంచరీలు, సెంచరీలు చేయడానికి చాలా టైం తీసుకుంటాడు..' అని వైభవ్ సమాధానం ఇచ్చినట్లుగా ఆ వీడియోలో ఉంది. కాగా ఇదంతా ఫేక్ అని హర్ష భోగ్లే క్లారిటీ ఇచ్చాడు.



ఇయ్యాల తెలంగాణ

గురువారం, 04-06-2026



# సినిమా






## పులి-మేకతో రోజా రీ ఎంట్రీ





సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేక పోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.



## వారణాసి స్టిల్స్ లీక్..జక్కన్న మౌనం




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి




గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.

## దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాంచకం




అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధి న ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## రికార్డులు తిరగరాస్తున్న కరుప్పు

### 300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి




## కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప‌క్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ఎ÷–లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.



Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. “RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com